# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | TGTEL/25/A1737 | వాస్తవాలే వార్తలుగా..

7.2.2026 శనివారం saturday | సంపుటి (volume): 1 సంచిక (Issue): 207 | పేజీలు : 12 Pages : 12 | వెల రూ. 2.00 | Published from : Hyderabad Circulated to : Telangana







# జీవన్ రెడ్డి 'స్వతంత్ర' పోరాటం..!



- జగిత్యాలలో విచిత్ర రాజకీయాలు
- డాక్టర్ సంజయ్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేనంట.. కాంగ్రెస్‌కు ప్రచారం!
- జీవన్‌రెడ్డి కాంగ్రెస్ మాజీ మంత్రంట.. స్వతంత్రులకు ప్రచారం
- అయోమయంలో జగిత్యాల ఓటర్లు
- పుసుక్కున రెండోడితో కొట్లాడితే మూడోడు లాభపడితే?

9

జగిత్యాల మున్సిపల్ ఎన్నికలు రాజకీయంగా హైవోల్టేజ్ డ్రామాగా మారాయి. కాంగ్రెస్ పార్టీలోని అంతర్గత విభేదాలు తీవ్రమవుతున్న నేపథ్యంలో మాజీ మంత్రి జీవన్ రెడ్డి స్వతంత్ర అభ్యర్థులకు బహిరంగ మద్దతు ప్రకటిస్తూ ఇంటింటా ప్రచారం చేస్తున్నారు. అదే సమయంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేస్తున్నారు. టికెట్ల కేటాయింపుపై అసంతృప్తితో జీవన్ రెడ్డి భావోద్వేగ వ్యాఖ్యలు చేస్తూ, రేవంత్ రెడ్డిపై కీలక ఆరోపణలు చేశారు.జగిత్యాలలో జీవన్ రెడ్డి చేస్తున్న 'స్వతంత్ర' పోరాటం వల్ల ఓటర్లు గందరగోళానికి గురవుతున్నారు.!




# ఇష్టం లేనప్పుడు చెప్పలేం

- గర్భం కొనసాగించాలని ఎలా అంటాం
- మైనర్ కేసులో సుప్రీం కోర్టు

4

సంతానోత్పత్తికి సంబంధించి మహిళలు స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే హక్కును సుప్రీంకోర్టు సమర్థించింది. ఇష్టం లేకుండా గర్భం కొనసాగించాలని ఏ మహిళను ఒత్తిడి చేయలేమని స్పష్టం చేసింది. మైనర్‌గా ఉన్నప్పుడు గర్భవతైన ఓ యువతి 30 వారాల గర్భాన్ని తొలగించేందుకు అత్యున్నత న్యాయస్థానం శుక్రవారం అనుమతించింది.

# కాంగ్రెస్‌ను గెలిపిస్తేనే అభివృద్ధి



**నిజామాబాద్ రైతుల పోరాటం ఆదర్శం**

## కేసీఆర్‌కు దత్తపుత్రుడిగా మారిన కిషన్ రెడ్డి

## అందుకే కేసీఆర్, కేటీఆర్‌ను కాపాడుతున్నాడు

- కాళేశ్వరంపై సీబీఐ విచారణకు ఆదేశించినా పట్టించుకోని కేంద్రం
- ధర్మపురి అర్వింద్‌తో జిల్లాకు ఒరిగింది శూన్యం
- బీజేపీ, బీఆర్ఎస్‌ను నమ్ముకుంటే నట్టేట ముంచుతారు
- మున్సిపల్ ఎన్నకల్లో కాంగ్రెస్‌ను గెలిపిస్తేనే అభివృద్ధి సాధ్యం
- నిజామాబాద్ పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి

**నిజామాబాద్, ఫిబ్రవరి 6:** నిజామాబాద్ రైతుల పోరాటం దేశానికే ఆదర్శమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. నిజామాబాద్‌లోని వ్యవసాయం తెలంగాణకే కాదు, దేశానికే ఆదర్శమన్నారు. నిజామాబాద్ జిల్లాలోని ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు అదనపు నిధులు ఇవ్వడానికి ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. నిజామాబాద్ జిల్లా బర్దిపూర్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం మాట్లాడారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ సూచనలతో ఈ జిల్లాలో అభివృద్ధి పనులు చేస్తున్నాం. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరవేయబోతున్నాం. మన వాళ్లు కార్పొరేటర్లుగా ఉంటే అభివృద్ధి జరుగుతుందని అన్నారు. నేను అందరివాడిని. నాకు కులం, మతం లేదు. ఈ జిల్లా గొప్ప నాయకులను అందించింది. మున్సిపల్ ఎన్నికల్లో విలక్షణమైన తీర్పు ఇవ్వాలి. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిజామాబాద్ మురికి కూపంగా మారిందని మండిపడ్డారు. ధర్మపురి అర్వింద్‌ను ఎంపీగా రెండుసార్లు గెలిపించినా.. కేంద్రంలోని

## రేవంత్‌పై ఎన్నికల పిటిషన్

రేవంత్ అభ్యర్థనను హైకోర్టు తిరస్కరణ

2

# అత్యధిక స్థానాలు గెలుస్తాం

మేనిఫెస్టో విడుదల చేసిన బీజేపీ అధ్యక్షుడు రామ్

3



# నేడు క్యాబ్ డ్రైవర్ల దేశవ్యాప్త సమ్మె

కనీస ఛార్జీలు, డ్రైవర్ల పని పరిస్థితులపై ఓలా, ఉబర్, ర్యాపిడో డ్రైవర్లు శనివారం దేశవ్యాప్త సమ్మెకు దిగనున్నారు. సమ్మె కారణంగా దేశవ్యాప్తం గా క్యాబ్, ఆటో, బైక్ ట్యాక్సీ సేవలకు అంతరాయం ఏర్పడ నుంది.

4





# ఫిరాయింపుల వ్యవహారంపై స్పీకర్ విచారణ

- పిటిషన్లపై తాజాగా సుప్రీం మరోమారు విచారణ
- మూడు వారాల్లో ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశం
- ప్రధాన పిటిషన్‌తో కలిపి విచారిస్తామని ధర్మాసనం

# కాంగ్రెస్‌ను ఓడిస్తేనే బతుకులు బాగుపడతాయి

- పన్నుల భారం మోపినోళ్లకు ఓటేద్దామా చెప్పండి
- మున్సిపల్ ప్రచారంలో నిలదీసిన హరీష్ రావు

ఈ మున్సిపల్ ఎన్నికల్లో మీరు కారు గుర్తుకు ఓటు గుద్దితే.. రేవంత్ రెడ్డికి గూబ గుయ్యిమనాలె అని హరీష్ రావు పిలుపునిచ్చారు. అప్పుడే భయపడి హామీలైనా అమలు చేస్తాడని అన్నారు. ఓటుకు 5 వేలు ఇస్తామంటారని, అవి తీసుకొని మోసపోవద్దని హెచ్చరించారు.

వివరాలు 3వ పేజీలో



# మరోమారు గడ్చిరోలిలో కాల్పులు

ముగ్గురు మావోయిస్టుల మృతి

2





# మూడు నెలల్లో కొత్త పార్టీ

ముహూర్తం కోసం ఎదురు చూస్తున్న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత

.. వివరాలు 3లో

## మార్చిలో ప్రారంభానికి సిద్ధమైన

# సనత్‌నగర్ ఆస్పత్రి

**మంత్రి ఆదేశాలతో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పరిశీలన**

**ఫిబ్రవరి 28లోగా అన్ని పనులు పూర్తి చేయాలని ఆదేశం**

**ఫిబ్రవరి 12 నుంచి విధుల్లోకి 100 మంది వైద్య సిబ్బంది**

**హైదరాబాద్,ఫిబ్రవరి6 :** సనత్‌నగర్ తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ను మార్చిలో ప్రారంభించేందుకు చేపట్టిన ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి. రోడ్లు / భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శుక్రవారం ఆసుపత్రి ప్రాంగణాన్ని విస్తృతంగా పరిశీలించారు. ఇంజనీరింగ్ ప్రతినిధులతో కలిసి అన్ని అంతస్తులలో కొనసాగుతున్న పనులను సమీక్షించారు. ఎమర్జెన్సీ విభాగం, ఆపరేషన్ థియేటర్లు, ఐసీయూలు, సెంట్రల్ స్టెరైల్ సర్వీసెస్ విభాగం సిద్ధతను ప్రత్యేకంగా పరిశీలించారు. ఫిబ్రవరి 28లోగా మిగిలిన అన్ని సివిల్, మౌలిక వసతుల పనులను పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఆసుపత్రి అంతటా సైన్‌బోర్డులు వంటి సహాయక వసతులను ఈ నెలాఖరులోగా సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. ఈపీసీ పరిధిలోని వైద్య పరికరాలన్నీ ఇప్పటికే అమర్చినట్లు కాంట్రాక్టర్ వెల్లడించగా, మొత్తం 540 వైద్య మరియు అనుబంధ పరికరాల కొనుగోలు పక్రియ కొనసాగుతోందని అధికారులు తెలిపారు. ఆసుపత్రి కార్యకలాపాల ప్రారంభానికి ముందుగా పరికరాల పరీక్షలు, ట్రయల్ రన్స్ నిర్వహించేందుకు వైద్య, సాంకేతిక సిబ్బందిని వెంటనే నియమించాలని వైద్య విద్యా డైరెక్టర్‌ను ఆదేశించారు. ఫిబ్రవరి 12 నుంచి 28 మధ్య తొలి దశలో 100 మంది వైద్య, పారా వైద్య మరియు హౌస్‌కీపింగ్ సిబ్బందిని విధుల్లోకి తీసుకురానున్నట్లు అధికారులు తెలిపారు. నెలాఖరుకు పూర్తి సిబ్బంది నియామకం పూ- ర్తవుతుందని వెల్లడించారు.మార్చిలో సనత్‌నగర్ ప్రజలకు అందుబాటులోకి రానుండటంతో, హైదరాబాద్ నగరానికి మరో కీలక ప్రభుత్వ వైద్య సంస్థగా ఇది నిలవనుందని అధికారులు తెలిపారు.



# నాగపూర్ ఎన్‌కౌంటర్‌లో కామారెడ్డి మావోయిస్ట్ మృతి

**నాగపూర్, ఫిబ్రవరి 6:**మహారాష్ట్రలోని గడ్చిరోలిలో జరిగిన భారీ ఎన్‌కౌంటర్ఘటనలో ఇప్పటి వరకు ఏడుగురు మావోయిస్టులు మృతి చెందారు. భమ్రాగఢ్ తాలూకా ఫడేవా అటవీప్రాంతంలో గురువారం నుంచి భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య కాల్పులు జరుగుతున్నాయి. నిన్న ముగ్గురు మావోయిస్టులు మృతి చెందగా, ఇవాళ మరో నలుగురి మృతదేహాలను గుర్తించారు. మృతుల్లో గడ్చిరోలి డివిజన్ కమిటీ ముఖ్య నేత ప్రభాకర్ ఉన్నట్టు గుర్తించారు. అతడి స్వస్థలం తెలంగాణలోని కామారెడ్డి. మావోయిస్టు ప్రభాకర్‌పై రూ. 50లక్షల రివార్డు ఉందని పోలీసులు వెల్లడించారు. ఎదురుకాల్పుల్లో ఒక పోలీసు అధికారి ప్రాణాలు కోల్పోగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశం నుంచి ఒక ఏకే-47 రైఫిల్‌తో సహా పలు ఆయుధాలు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

# రేవంత్‌పై ఎన్నికల పిటిషన్

**రేవంత్ అభ్యర్థనను హైకోర్టు తిరస్కరణ**

**హైదరాబాద్, ఫిబ్రవరి 6:** హైకోర్టులో సీఎం రేవంత్ రెడ్డికి ఎదురుదెబ్బ తగిలింది. తనపై నమోదైన క్రిమినల్ కేసులను కొట్టివేయాలంటూ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు తిరస్కరించింది. 2023లో భూపాలపల్లిలో జరిగిన బహిరంగ సభలో తనపై అనుచిత వ్యాఖ్యలు చేశారని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు మేరకు కేసులు నమోదు కాగా, వాటిని రద్దు చేయాలంటూ సీఎం రేవంత్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. అయితే ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని పేర్కొన్న న్యాయస్థానం పిటిషన్‌ను కొట్టివేస్తూ, తదుపరి విచారణను ఈ నెల 21వ తేదీకి వాయిదా వేసింది.



# గడ్చిరోలిలో మరోమారు కాల్పులు

**ముగ్గురు మావోయిస్టుల మృతి**

**రాయపూర్, ఫిబ్రవరి 6 :** మహారాష్ట్ర – ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతాల్లో పోలీస్ భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురుకాల్పులు జరిగాయి. గడ్చిరోలి అడవుల్లో జరిగిన ఈ కాల్పుల ఘటనలో భారీ నష్టం వాటిల్లింది. అటవీ ప్రాంతంలో మావోయిస్టుల కదలికలు ఉన్నాయని ఇంటెలిజెన్స్ సమాచారం అందడంతో.. పోలీసులు, భద్రతా బలగాలు గురువారం నుంచి గాలింపు చర్యలు చేపట్టాయి. భద్రతా బలగాలు అడవిలోకి ప్రవేశించగానే మావోయిస్టుల వైపు నుంచి కాల్పులు మొదలయ్యాయి. ప్రతిగా బలగాలు జరిపిన కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మరణించారు. ఈ హోరాహోరీ పోరులో కమాండో దీపక్ ప్రాణాలు కోల్పోగా, గాయపడిన మరో అధికారిని మెరుగైన చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ఘటనాస్థలిలో ఏకే-47, ఈూఒఖీ స్వాధీనం చేసుకున్నాయి భద్రతా బలగాలు. ఘటనా స్థలంలో పోలీసులు.. ఆయుధాలు, విప్లవ సాహిత్యం, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఆ ప్రాంతంలో ఇంకా కొందరు మావోయిస్టులు దాగిఉండే అవకాశముందని పోలీసులు భావిస్తున్నారు. ఈ ఎన్‌కౌంటర్‌తో గడ్చిరోలి జిల్లాలో ఉత్కంఠ వాతావరణం నెలకొంది. స్థానికులను అప్రమత్తం చేసిన అధికారులు.. అటవీ ప్రాంతాల వైపు వెళ్లవద్దని సూచనలు జారీ చేశారు. ఎన్‌కౌంటర్ పూర్తైన తర్వాత మృతుల సంఖ్య, స్వాధీనం చేసుకున్న ఆయుధాల వివరాలను అధికారికంగా వెల్లడిస్తామని పోలీస్ ఉన్నతాధికారులు స్పష్టం చేశారు.

# న భూతో న భవిష్యత్తు అనేలా 'గద్దర్ ఫిల్మ్ అవార్డులు'

**ప్రపంచ సినీ కేంద్రంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దుతాం..**

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**సినిమా స్క్రీనింగ్ ప్రక్రియ ప్రారంభం**



**హైదరాబాద్, ఫిబ్రవరి 6:** ప్రజా గాయకుడు గద్దర్ ఆలోచనలను ప్రజా ప్రభుత్వం అమలు చేస్తోందని, ఆయన పేరిట ఇచ్చే 'గద్దర్ ఫిల్మ్ అవార్డుల' ప్రదానోత్సవ కార్యక్రమాన్ని వచ్చే ఉగాది పర్వదినం సందర్భంగా న భూతో న భవిష్యత్తు అన్న రీతిలో అత్యంత వైభవంగా నిర్వహిస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. శుక్రవారం సాయంత్రం ప్రసాద్ లాబ్స్‌లో ఏర్పాటు చేసిన గద్దర్ ఫిల్మ్ అవార్డుల సినిమా స్క్రీనింగ్ ప్రక్రియను ఆయన అధికారికంగా ప్రారంభించారు. విశ్వవ్యాప్త సినీ హబ్‌గా భాగ్యనగరం: ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ, ప్రపంచ ఫిల్మ్ ఇండస్ట్రీ మొత్తం హైదరాబాద్ వైపు చూసేలా అవార్డుల ఫంక్షన్‌ను నిర్వహించాలని ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎఫ్ డీసీ) కు సూచించారు. ఇందుకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణంగా అందిస్తుందని భరోసా ఇచ్చారు. హైదరాబాద్ కేవలం తెలుగు పరిశ్రమకే కాకుండా, భారతదేశంలోని వివిధ భాషా చిత్రాలకు ప్రధాన కేంద్రంగా మారాలన్నది తమ ప్రభుత్వ సంకల్పమని ఆయన పేర్కొన్నారు. నగరంలోని సానుకూల వాతావరణం, నిపుణుల లభ్యత, మరియు శాంతిభద్రతలను ఉపయోగించుకుని హైదరాబాద్‌ను ప్రపంచ సినీ కేంద్రంగా మార్చేందుకు ప్రభుత్వం ఒక 'బ్లూ ప్రింట్' సిద్ధం చేసుకుని ముందుకు సాగుతోందని వివరించారు. సామాజిక మార్పు కోసం తన జీవితాన్ని ధారపోసిన మహానుభావుడు గద్దర్ అని, ఆయన జ్ఞాపకార్థం రెండవ ఏడాది ఈ అవార్డులను ప్రభుత్వం నిర్వహిస్తోందని భట్టి విక్రమార్క తెలిపారు. తెలుగు చిత్ర పరిశ్రమలోని అన్ని విభాగాలకు ఈ అవార్డులను అందజేయనున్నట్లు వెల్లడించారు. సినిమా పరిశ్రమకు ఆర్థికంగా, సామాజికంగా లేదా శాంతిభద్రతల పరంగా ఎలాంటి అవసరం ఏర్పడినా అర్ధరాత్రి కూడా ప్రభుత్వం తలుపు తట్టవచ్చని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మరియు తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు. పారదర్శకంగా అవార్డుల ఎంపిక: గద్దర్ ఫిల్మ్ అవార్డుల కార్యక్రమాన్ని బాధ్యతాయుతంగా ముందుకు తీసుకెళ్తున్న ఎఫ్డీసీ చైర్మన్ దిల్ రాజును ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం అభినందించారు. అవార్డుల ఎంపిక ప్రక్రియలో జూరీ చైర్మన్ మణిశర్మ నేతృత్వంలోని కమిటీ ఎలాంటి తరతమ భేదాలు లేకుండా, అత్యంత పారదర్శకంగా మరియు నిష్పక్షపాతంగా అభ్యర్థులను ఎంపిక చేయాలని కోరారు. మున్సిపల్ ఎన్నికల బిజీ వల్ల సీఎం రేవంత్ రెడ్డి మరియు మంత్రి కోమటిరెడ్డి హాజరు కాలేకపోయారని, అయితే సినిమా రంగాన్ని ప్రోత్సహించడమే తమ లక్ష్యమని వారు సందేశం పంపారని భట్టి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్డీసీ చైర్మన్ దిల్ రాజు, స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ మణిశర్మ, ఎఫ్డీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కిషోర్ బాబు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

# ఫిరాయింపుల వ్యవహారంపై స్పీకర్ విచారణ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6:** తెలంగాణ రాజకీయాల్లో అత్యంత ఆసక్తి రేపుతున్న పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు విచారణను సుప్రీంకోర్టు మూడు వారాల పాటు వాయిదా వేసింది. న్యాయస్థానంలో తాజాగా జరిగిన విచారణలో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ అగస్టిన్ జార్జ్‌లతో కూడిన ధర్మాసనం.. బీఆర్ఎస్, బీజేపీ దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ చేపట్టింది. తెలంగాణ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపిస్తూ.. అనర్హత పిటిషన్లపై తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ వద్ద విచారణ ప్రస్తుతం కొనసాగుతోందని కోర్టుకు స్పష్టం చేశారు. ఈ పక్రియ పూర్తి చేయడానికి మరో మూడు వారాల సమయం కావాలని ఆయన కోరారు. అసెంబ్లీ స్పీకర్‌కు ఇప్పటికే తగినంత సమయం ఇచ్చామని గతంలోనే గుర్తు చేసిన ధర్మాసనం, ఈసారి స్పీకర్ నిర్ణయం పాజిటివ్‌గా ఉండాలని స్పష్టం చేసింది. సింఘ్వీ విన్నపాన్ని మన్నిస్తూ, తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. ఆ సమయానికి స్పీకర్ తీసుకున్న నిర్ణయాల పూర్తి సమాచారాన్ని సమర్పించాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. బీజేపీ ఫ్లోర్ లీడర్ ఏలేటి మహేశ్వర్ రెడ్డి కూడా ఈ వ్యవహారంలో స్పీకర్‌పై కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాలను స్పీకర్ అమలు చేయలేదని మహేశ్వర్ రెడ్డి తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఆయన దాఖలు చేసిన ఈ ధిక్కరణ పిటిషన్‌ను కూడా ప్రధాన పిటిషన్‌తో కలిపి విచారిస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు తాజా ఆదేశాలతో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మూడు వారాల గడువులోగా ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది ఇప్పుడు ఉత్కంఠగా మారింది. కోర్టు పర్యవేక్షణలో ఉన్న ఈ కేసు తెలంగాణ రాజకీయ భవిష్యత్తుపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

# హైదరాబాద్ అభివృద్ధికి రెండేళ్లలో రూ.20 వేల కోట్లు

- ప్రపంచ అగ్ర నగరాలతో పోటీ పడే మహానగరంగా హైదరాబాద్
- 27 మున్సిపాలిటీల విలీనం చారిత్రాత్మక నిర్ణయం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క




**హైదరాబాద్, ఫిబ్రవరి 6 :** హైదరాబాద్ మహానగర అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కేవలం రెండేళ్ల వ్యవధిలోనే రూ. 20 వేల కోట్లను కేటాయించిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఈ నిధులతో అనేక అభివృద్ధి పనులు ఇప్పటికే పూర్తికాగా, మరికొన్ని పనులు వేగంగా ప్రగతిలో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ స్థాయిలో నగరాభివృద్ధికి నిధులు కేటాయించడం రాష్ట్ర చరిత్రలో ఇదే తొలిసారి అని స్పష్టం చేశారు. శుక్రవారం హైటెక్స్‌లో నిర్వహించిన క్రెడాయ్ ప్రాపర్టీ ఎగ్జిబిషన్ షోలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీ పరిధిలో రూ. 1,950.52 కోట్లు, మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు పరిధిలో రూ. 12,500 కోట్లు, ఇతర నగరాభివృద్ధి కార్యక్రమాలకు రూ. 4,365 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. పెట్టుబడులు, ప్రతిభ, జీవన ప్రమాణాల నాణ్యతలో హైదరాబాద్ దేశంలోని నగరాలతోనే కాకుండా ప్రపంచంలోని అగ్ర నగరాలతో పోటీ పడుతున్న మహానగరంగా ఎదుగుతోందని తెలిపారు. హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న 27 పట్టణ స్థానిక సంస్థలను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేయడం ఒక చారిత్రాత్మక నిర్ణయమని అభివర్ణించారు. ఈ నిర్ణయంతో సమగ్ర ప్రణాళిక, సమాన పౌర సేవలు, ఔటర్ రింగ్ రోడ్ పరిధిలో ఏకరీతి అభివృద్ధి సాధ్యమైందన్నారు.

**7,032 కోట్లతో భారీ ప్రాజెక్టులు**

హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రోగ్రామ్ కింద 45 ఫ్లైఓవర్లు, అండర్‌పాసులు, 10 ప్రధాన రోడ్డు విస్తరణ ప్రాజెక్టులు అమలు చేస్తున్నట్లు తెలిపారు. కేబీఆర్ పార్క్ పరిసరాల్లో ట్రాఫిక్ నియంత్రణకు రూ. 1,090 కోట్లు, పడమటి కారిడార్‌లో మల్టీలెవల్ ఫ్లైఓవర్లకు రూ. 837 కోట్లు, ఉత్తర హైదరాబాద్‌లో ప్రత్యామ్నాయ రహదారి నెట్‌వర్క్‌లకు రూ. 960 కోట్లు, తూర్పు హైదరాబాద్‌లో కనెక్టివిటీ మెరుగుదలకు రూ. 416 కోట్లు, దక్షిణ భాగంలో రోడ్డు విస్తరణకు రూ. 863 కోట్లు వెచ్చిస్తున్నామని వివరించారు. ఈ అభివృద్ధి నగరమంతటా సమతుల్యంగా సాగుతోందని, ఏ ప్రాంతాన్నీ నిర్లక్ష్యం చేయడం లేదని స్పష్టం చేశారు. ఈ పెట్టుబడులు ప్రయాణ సమయాన్ని తగ్గించి, ఆర్థిక కార్యకలాపాలను బలోపేతం చేయడమే కాకుండా సాధారణ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నాయని అన్నారు. తెలంగాణ రైజింగ్ విజన్‌ఉ2047 కింద హైదరాబాద్‌ను కోర్ అర్బన్ ఎకానమీగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. వరదల నివారణ, వాతావరణ అనుకూలత కోసం సమగ్ర స్టార్మ్ వాటర్ మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేస్తున్నామని చెప్పారు. దేశంలోనే అత్యంత నివసించదగిన, పెట్టుబడులకు అనుకూలమైన, మంచి పాలన కలిగిన నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దడమే సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

# కాంగ్రెస్‌ను గెలిపిస్తేనే అభివృద్ధి సాధ్యం

మొదటి పేజీ తరువాయి

భాజపా ప్రభుత్వం ఈ ప్రాంతానికి ఏమీ చేయలేదు. మోదీ మూడు సార్లు ప్రధానమంత్రి అయినా.. నిజామాబాద్ స్మార్ట్ సిటీ కాలేదు. మోదీ దగ్గర ఎంపీ అర్వింద్‌కు పరపతి ఉంటే నిజామాబాద్‌ను ఎందుకు స్మార్ట్ సిటీగా ప్రకటించలేదని ప్రశ్నించారు. కాళేశ్వరంలో ప్రాజెక్టులో అవినీతి జరిగిందని భాజపా చెప్పింది. ఆ కేసును సీబీఐకి అప్పగించాం ఏమైంది? కేసీఆర్, కేటీఆర్‌ను ఎప్పుడు అరెస్టు చేస్తారని భాజపాని అడుగుతున్నానని మరోమారు ప్రశ్నించారు. కెసీఆర్, కేటీఆర్‌ను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కాపాడుతున్నారు. కిషన్‌రెడ్డి.. కల్వకుంట్ల కిషన్‌రావుగా మారారని సీఎం విమర్శించారు. దత్తపుత్రుడు కిషన్ రెడ్డి, దొంగ పుత్రుడు కేటీఆర్ కలిసి కేసీఆర్ ను కాపాడుతున్నారుని ఆరోపించారు. కాళేశ్వరం కేసు సీబీఐకి ఇస్తే 48 గంటల్లో కేసీఆర్ ను జైల్లో పెడతామన్న కిషన్ రెడ్డి.. కాళేశ్వరం కేసును బీజేపీ ఎందుకు ముందుకు సాగనీయడం లేదు.. సీబీఐ విచారణ చేయాలని కోరినా ఇప్పుడు ఎందుకు చేయటం లేదని ప్రశ్నించారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు దొందు దొందే ..నిజామాబాద్ జిల్లాలో బీజేపీ, బీఆర్ఎస్‌లను గెలిపిస్తే అభివృద్ధి జరగదని అన్నారు. బీజేపీనుంచి ఇద్దరు కేంద్ర మంత్రులన్నా.. నిధులు తెచ్చింది నిల్ అన్నారు. జిల్లా అభివృద్దే లక్ష్యంగా కాంగ్రెస్ పనిచేస్తోందన్నార్డు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు గెలవాలంటే కాంగ్రెస్ ను గెలిపించుకోవాలన్నా రు. అభివృద్దే లక్ష్యంగా నిజామాబాద్ జిల్లాలో అనేక సంక్షేమ కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశాం.. ఒక కార్పొరేషన్, ఏడు మున్సిపాలిటీలలోవెయ్యి కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు సీఎం రేంత్ రెడ్డి.రూ. 600కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌నిర్మిస్తున్నామన్నారు. నిజామాబాద్ జిల్లా అభివృద్ధికి 100 శాతం సహకరిస్తా..నిధులిచ్చే బాధ్యత నాది.. నిజామాబాద్ ను అభివృద్ధి చేసే బాధ్యత నాది అని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్,సలహాదారు సుదర్శన్ రెడ్డి, మంత్రులు,ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు.



# అత్యధిక స్థానాలు గెలుస్తాం

- మున్సిపల్ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలుస్తాం
- పన్నుల్లో ప్రజలకు వెసులుబాటు కల్పిస్తాం
- కోతులు, కుక్కల బెడదను నివారిస్తాం
- మేనిఫెస్టో విడుదల చేసిన బీజేపీ అధ్యక్షుడు రామ్



**హైదరాబాద్, ఫిబ్రవరి 6:** తెలంగాణలో జరిగే మున్సిపల్ ఎన్నికల్లో భాజపా విజయం సాధిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు ధీమా వ్యక్తం చేశారు. భాజపా విజయం సాధిస్తే పెండింగ్‌లో ఉన్న పన్నుల్లో వెసులుబాటు కల్పిస్తామని, మోడ్రన్ మున్సిపాలిటీలుగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. ఫైనాన్స్ కమిషన్ ఇచ్చే నిధులను పారదర్శకంగా ఖర్చు చేస్తామన్నారు. అవినీతి రహిత మున్సిపాలిటీలే తమ లక్ష్యమని.. అవినీతికి పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. కబ్జాలపై ఉక్కు పాదం మోపడంతో పాటు యువతకు వాకింగ్ ట్రాక్స్ ఏర్పాటు చేస్తామన్నారు. మున్సిపాలిటీ ఎన్నికల్లో వీలైనన్ని ఎక్కువ స్థానాలు గెలుచుకోవడమే లక్ష్యంగా కమలం పార్టీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు రాంచందర్ రావు మున్సిపల్ ఎన్నికల మేనిఫెస్టోను అధికారికంగా విడుదల చేశారు.ప్రధాన అంశాల్లో కోతులు, కుక్కల బెడద నివారణను చేర్చారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో.. మున్సిపల్ ఎన్నికల రాష్ట్ర సహ ఇన్‌ఛార్జిలు అశోక్ పర్ణామి, రేఖాశర్మతో కలిసి వికసిత తెలంగాణ.. భాజపా సంకల్ప పత్రం పేరుతో మున్సిపల్ ఎన్నికల మేనిఫెస్టోను రామచందర్ రావు విడుదల చేశారు.కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు భాజపాను చూసి భయపడుతున్నాయని అని రామచందర్ రావు అన్నారు. కేంద్రం.. తెలంగాణకు ఏం ఇచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నిస్తున్నారని మండిపడ్డారు. కేంద్రం రాష్ట్రానికి ఏం ఇచ్చిందో.. జిల్లాల వారీగా చెబుతామని, రేవంత్ రెడ్డి జిల్లాలకు ఏం ఇచ్చారో చెప్పగలరా అని సవాల్ విసిరారు. పోలీసులు భాజపా కార్యకర్తలపై దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రామగుండం, మంచిర్యాలలో పార్టీ కార్యకర్తలపై కాంగ్రెస్ దాడులు చేసిందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ పోలీసులను కార్యకర్తల్లా ఉపయోగించుకుంటుందని దుయ్యబట్టారు. పోలీసులు బీజేపీ కార్యకర్తలపై దాడులు చేస్తే మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. కేంద్రంలో భాజపా సర్కార్ ఉన్న విషయాన్ని మర్చిపోవద్దన్నారు. పన్నుల పెంపు లేదు, వారం రోజుల్లో ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు, బస్తీ దవాఖానలు, స్మార్ట్ సిటీలుగా అభివృద్ధి, క్లీన్ సిటీ, గ్రీన్ టౌన్. 100 శాతం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ , దేవాలయాల రక్షణ, మహిళల రక్షణ. మున్సిపాలిటీల్లో దోమలు, పందులు, కుక్కలు, కోతుల బెడద నివారణ. సమ్మిళిత, సుస్థిర అభివృద్ధి కోసం బీజేపీ మేనిఫెస్టో అంటూ రూపకల్పన తొలిసారి తెలంగాణలో అన్ని మున్సిపల్ వార్డుల్లో పోటీ చేస్తున్న బీజేపీ మెజారిటీ స్థానాల్లో కాషాయ జెండా ఎగురవేయాలని పార్టీ పట్టుదలతో ఉంది. 60 శాతానికి పైగా మున్సిపాలిటీలు, కనీసం 5 కార్పొరేషన్లను దక్కించుకోవాలని టార్గె÷ట్ పెట్టుకుంది. ఇందుకోసం స్థానిక ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కష్టపడుతున్నారు. బీజేపీ యువ మోర్చాకు ఈ ఎన్నికల్లో ప్రత్యేక టాస్క్ ఇచ్చారు. జెన్-జీ టార్గెట్‌గా ప్రచారంలో వినూత్న కార్యక్రమాలు చేపట్టాలని దిశానిర్దేశర చేశారు..

# పవన్ ప్రచారం రద్దు



**నల్లగొండ, ఫిబ్రవరి 6:** తెలంగాణలో జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పర్యటన రద్దు అయ్యింది. ఆదివారం నల్గొండలో బీజేపీ తరఫున మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పవన్ కల్యాణ్ పాల్గొంటారని ముందే ప్రకటించింది తెలంగాణ బీజేపీ.. అయంతే, తాజాగా పవన్ పర్యటన రద్దు అయినట్టు వెల్లడించింది. ఏపీలో ప్రస్తుత రాజకీయ పరిణామాలు.. వ్యక్తిగత కారణాలతో పవన్ పర్యటన రద్దయ్యిందని ప్రకటించింది బీజేపీ.. ఇక, తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో 336 వార్డుల్లో జనసేన పార్టీ తరఫున అభ్యర్థులు పోటీ చేస్తున్నారు.. ఈ నెల 11వ తేదీన జరగనున్న తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా 336 వార్డుల్లో జనసేన పార్టీ పోటీ చేస్తున్నట్టు పార్టీ ప్రకటించింది.. ఇందుకు సంబంధించి పార్టీ అభ్యర్థుల ః-ఫారమ్‌లు దాఖలు చేయగా, స్థానిక ఎన్నికల రిటర్నింగ్ అధికారులు నామినేషన్లను ఆమోదించారు. ఈ ఎన్నికల్లో జనసేన పార్టీ అభ్యర్థులు గాజు గ్లాస్ గుర్తుపై పోటీ చేయనున్నారని పార్టీ వెల్లడించింది..



# పార్టీలో తన వర్గాన్ని దూరం పెట్టారు

## రాజకీయంగా దెబ్బకొట్టేందుకు యత్నాలు

## కాంగ్రెస్ తీరుపై జీవన్ రెడ్డి ఆవేదన

**జగిత్యాల, ఫిబ్రవరి 6:** జగిత్యాల మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి భావోద్వేగానికి లోనయ్యారు. ఎన్నికల్లో తన వర్గానికి సీట్లు కేటాయించకుండా పక్కకు పెట్టడంపై ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. రాజకీయంగా తన మెడ నరకడానికి కాంగ్రెస్ పార్టీలో ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. తన భుజాలుగా ఉన్న వ్యక్తులను తనకు దూరం చేశారని చెప్పారు. పార్టీ మారితే రాళ్లతో కొట్టమని చెప్పిన రేవంత్ రెడ్డి.. ఇప్పుడు పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. ప్రచారం సందర్భంగా పార్టీకి చెందిన మహిళలు, కార్యకర్తలతో ఆయన తన బాధను చెప్పి కన్నీళ్లు పెట్టుకున్నారు. దాంతో వారు జీవన్‌రెడ్డిని ఓదార్చారు. మున్సిపాలిటీలో తాము మీ వర్గాన్ని గెలిపించి తీరుతామని చెప్పారు. కాగా చట్టసభలకు ఏ పార్టీ తరఫున గెలిస్తే ఆ పార్టీలోనే ఉండాలని గతంలో రాహుల్‌గాంధీ చెప్పిన విషయాన్ని జీవన్‌రెడ్డి గుర్తుచేశారు. రేవంత్ రెడ్డి ఆయన పార్టీ మారితే రాళ్లతో కొట్టాలని గతంలో చెప్పారని, కానీ ఆయనే పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. వేరే పార్టీల్లో గెలిచి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చిన వాళ్లను ఓటుతో కొట్టాలని తాను అంటున్నానని చెప్పారు. తన వర్గం వారికి కాంగ్రెస్ సీట్లు నిరాకరించడంతో కొన్ని వార్డుల్లో స్వతంత్ర్యులుగా బరిలో దిగిన తన వర్గం వారి తరఫున జీవన్‌రెడ్డి ప్రచారం చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తన వర్గాన్ని పక్కనపెట్టి.. తనతోపాటు బీఆర్ఎస్ పార్టీ నుంచి వచ్చిన వారిని ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. సంజయ్ కుమార్ తాను బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నానని చెబుతున్నారని, కానీ కాంగ్రెస్ జెండా పట్టుకుని ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్‌లోనే ఉన్నా అంటూ సంజయ్ కాంగ్రెస్ జెండాను ఎత్తుకుపోయాడని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీలో దొంగలు పడ్డారని వ్యాఖ్యానించారు.

# కాంగ్రెస్‌ను ఓడిస్తేనే బతుకులు బాగు

- జిన్నారంను మున్సిపాలిటీ చేసి భారం మోపిన కాంగ్రెస్
- పన్నుల భారం మోపినోళ్లకు ఓటేద్దామా చెప్పండి
- మున్సిపల్ ప్రచారంలో నిలదీసిన హరీష్ రావు



**సంగారెడ్డి, ఫిబ్రవరి 6:** కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే జిన్నారంను మున్సిపాలిటీ చేసి మీ మీద పన్నుల భారం మోపిందని, ఇప్పుడు ఎవరికి ఓటేద్దాం? అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీష్‌రావు ఓటర్లను ప్రశ్నించారు. మనల్ని మంచిగా చూసుకున్న వాళ్ళకు, మన భారాన్ని తగ్గించే వాళ్ళకే ఓటేద్దామని అన్నారు. హరీష్‌రావు పటాన్‌చెరువు నియోజకవర్గంలోని జిన్నారం మున్సిపాలిటీలో శుక్రవారం పర్యటించారు. జిన్నారం గ్రామం వాకిటి వద్ద స్థానికులతో ముచ్చటించిన ఆయన.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తున్న తీరును ఎండగట్టారు. తాము అధికారంలో ఉన్నప్పుడు జిన్నారం గ్రామం గ్రామపంచాయతీగానే ఉండాలని కోరుకున్నామని, మున్సిపాలిటీ అయితే ప్రజల మీద పన్నుల భారం పడుతుందని ఆపామని చెప్పారు. కానీ కేసీఆర్ రూ.200 ఉన్న పెన్షన్‌ను రూ.2000 చేస్తానని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన మొదటి నెలలోనే ఆ హామీని నెరవేర్చారని చెప్పారు. రేవంత్ రెడ్డి రూ.4000 ఇస్తానని చెప్పి రెండేళ్లు గడిచినా ఇవ్వడం లేదని విమర్శించారు. ఏపీలో చంద్రబాబు రూ.4000 ఇస్తానని చెప్పి ఇస్తున్నాడు కదా? మరి ఇక్కడ రేవంత్ రెడ్డికి ఎందుకు చేతులు రావడం లేదు..? అని ప్రశ్నించారు. మహాలక్ష్మి పథకం కింద నెలకు రూ.2500 ఇస్తానని చెప్పి రేవంత్ రెడ్డి మోసం చేశాడని హరీష్‌రావు విమర్శించారు. ఈ 24 నెలల్లో ఒక్కో మహిళకు ప్రభుత్వం రూ.60,000 చొప్పున బాకీ పడిందని అన్నారు. కేసీఆర్ ఉన్నప్పుడు బతుకమ్మకు ప్రతి మహిళకు చీర ఇచ్చేదని, రేవంత్ రెడ్డి వచ్చాక చీర లేదు, గాజులు లేవని చెప్పారు. ఏదో గ్రూపులో ఉన్న కొద్దిమందికి ఇచ్చి చేతులు దులుపుకున్నాడని అన్నారు. ఫ్రీ బస్సు అని చెప్పి మగవాళ్లకు టికెట్ రేట్ డబుల్ చేశాడని తెలిపారు. ఆడోళ్ళకు సీటు దొరక్క తిప్పలు పడుతున్నారని చెప్పారు. రేవంత్ రెడ్డి వచ్చాక 5 పంటలు వస్తే.. రెండింటికి ఇచ్చి మూడింటికి రైతుబంధు ఎగ్గొట్టాడని విమర్శించారు. నాటేసిన వాళ్లకే రైతుబంధు ఇస్తా, శాటిలైట్‌లో చూసి ఇస్తా అని కొత్త నిబంధనలు పెట్టి రైతులను గోస పెడుతున్నాడని రేవంత్‌రెడ్డిపై హరీష్‌రావు మండిపడ్డారు. దేవుడి మీద ఒట్టు వేసి రుణమాఫీ చేస్తానని చెప్పి మాట తప్పిన పాపాత్ముడు రేవంత్ రెడ్డి అని విమర్శించారు. ఏ ఊర్లో చూసినా సగం మందికి కూడా రుణమాఫీ కాలేదన్నారు. ఈ మున్సిపల్ ఎన్నికల్లో మీరు కారు గుర్తుకు ఓటు గుద్దితే.. రేవంత్ రెడ్డికి గూబ గుయ్యిమనాలె అని పిలుపునిచ్చారు. అప్పుడే భయపడి హామీలైనా అమలు చేస్తాడని అన్నారు. ఓటుకు 5 వేలు ఇస్తామంటారని, అవి తీసుకొని మోసపోవద్దని హెచ్చరించారు. మహిళలకు రావాల్సిన రూ.60,000, అవ్వ తాతలకు రూ.4000 పెన్షన్ రావాలంటే బీఆర్ఎస్ గెలవాలని అన్నారు. అవ్వతాతలు పెన్షన్ అడిగితే లాగుల తొండలు ఇడిసిపెడతా అంటాడని, మహిళలు హామీల గురించి అడిగితే మెడలో పేగులు వేసుకుంటా అంటాడని, తులం బంగారం ఏదని అడిగితే గుడ్లు పీకి గోటీలు ఆడుతా అంటాడని హరీష్‌రావు సీఎంను విమర్శించారు. ప్రశ్నిస్తే కళ్లు నెత్తికెక్కి మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. ఈ ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పి సీఎం అహంకారాన్ని దించాలని పిలుపునిచ్చారు. రెండేళ్లు ఓపిక పట్టాలని, వచ్చేది మళ్ళీ కేసీఆర్ ప్రభుత్వమేనని అన్నారు. జిన్నారం సమస్యలు పరిష్కరించుకుందామని చెప్పారు. రేవంత్ రెడ్డి ముస్లింలకు ఒక్క రూపాయి పని కూడా చేయలేదని, కాబట్టి అందరూ ఏకమై కారు గుర్తు అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

# మూడు నెలల్లో కొత్త రాజకీయ పార్టీ

## ముహూర్తం కోసం ఎదురు చూస్తున్న తెలంగా జాగృతి అధ్యక్షురాలు కవిత



**హైదరాబాద్, ఫిబ్రవరి 6:** మరో మూడు నెలల్లో కొత్త రాజకీయ పార్టీని ప్రకటించనున్నట్లు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వెల్లడించారు. తన రాజకీయ భవిష్యత్తుకు సంబంధించిన కీలక నిర్ణయాన్ని సరైన సమయంలో తీసుకుంటానని చెప్పారు. తనకు సెంటిమెంట్ ఎక్కువన్న ఆమె.. మంచి మూహూర్తం కోసం ఎదురు చూస్తున్నానని తెలిపారు. కొంత కాలం గడిచిన తర్వాత తన బలం ఏంటో అందరికీ అర్థమవుతుందని కవిత వ్యాఖ్యానించారు. ప్రజలే తనను నాయకురాలిగా తీర్చిదిద్దాలని, వారి మద్దతే తనకు అసలైన బలమని పేర్కొన్నారు. బీఆర్ఎస్‌తో తనకు ఒరిగిందేమీ లేదని స్పష్టం చేసిన కవిత.. భవిష్యత్తులో తన రాజకీయ ప్రయాణం పూర్తిగా ప్రజల మద్దతుపైనే ఆధారపడి ఉంటుందన్నారు. ఈ క్రమంలోనే మున్సిపల్ ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు ఎందుకు ప్రచారం చేయడం లేదని కవిత ప్రశ్నించారు. జాగృతి సంస్థ పోటీ చేస్తున్న ప్రాంతాల్లో హరీశ్ రావు ఎందుకు తిరుగుతున్నారని నిలదీశారు. అలాగే కేటీఆర్ సిరిసిల్ల నియోజకవర్గానికే ఎందుకు పరిమితమయ్యారని ఆమె ప్రశ్నల వర్షం కురిపించారు. తనపై విమర్శలు చేస్తున్న వారిపై కవిత ఘాటు వ్యాఖ్యలు చేశారు. 'గుంటనక్క, గూఢచారి' వంటి పేర్లు వారికి నప్పుతాయి కాబట్టే అలా పిలుస్తున్నాన న్నారు. రాజకీయాల్లో విమర్శలు సహజమేనని, కానీ వ్యక్తిగత ఆరోపణలు చేస్తే తాను కూడా మౌనంగా ఉండబోనని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో తన రాజకీయ వ్యూహం మరింత స్పష్టంగా ఉంటుందని, కొత్త పార్టీ ప్రకటనతో తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చ మొదలవుతుందని కవిత చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఇదిలావుంటే ఈ మున్సిపల్ ఎన్నికల్లో ఫార్వర్డ్ బ్లాక్ గుర్తుపై జాగృతి అభ్యర్థులు పోటీ చేస్తున్నారు.

# కంజర్ల రేణుక ప్రచార హోరు

## 13వ డివిజన్‌లో ఇంటింట ప్రచారం

## 'కారు' గుర్తుకు ఓటేయాలని విన్నపం



**నేటి సాక్షి, కరీంనగర్ టౌన్:** కరీంనగర్ నగరపాలక సంస్థ ఎన్నికల బరిలో నిలిచిన 13వ డివిజన్ బీఆర్ఎస్ కార్పొరేటర్ అభ్యర్థి కంజర్ల రేణుక తన ఎన్నికల ప్రచారంలో వేగం పెంచారు. డివిజన్ అభివృద్ధి, ప్రజల ఉజ్వల భవిష్యత్తు కేవలం బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమని పేర్కొంటూ ఆమె శుక్రవారం ఇంటింటా విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెకు కాలనీవాసులు నీరాజనాలు పలికారు. గతంలో ఏ పార్టీ కూడా డివిజన్ అభివృద్ధిపై చిత్తశుద్ధితో దృష్టి సారించలేదని, సమగ్ర ప్రగతి కోసం బీఆర్ఎస్‌కు ఒక్క అవకాశం ఇవ్వాలని ఆమె ఓటర్లను కోరారు. స్థానిక ఎమ్మెల్యే గంగుల కమలాకర్ సహాయ సహకారాలతో 13వ డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే తన ఏకైక ధ్యేయమని స్పష్టం చేశారు. డివిజన్ ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తానని, అభివృద్ధిని చూసి కారు గుర్తుకు ఓటేసి తనను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆమె అభ్యర్థించారు. ఈ ప్రచార కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో డివిజన్ ప్రజలు, పార్టీ కార్యకర్తలు పాల్గొని సంఘీభావం తెలిపారు.




సంపాదకీయం

# బానిస భావజాలంలో విమర్శల జోరు!

గతంలో వికీ లీక్స్ కూడా ఓ ఊపు ఊపింది. విదేశాల్లో ఉన్న ఊరూపేరు లేని కొందరు పనిగట్టుకుని ప్రపంచ దేశాల్లో ఉన్నవారిపై ఊకదంపుడు, ఊహాగాన కథనాలు రాస్తుంటారు. అవన్నీ పట్టుకుని మనదేశంలో నోరు పెద్దదిచేసి అరవడం కొందరు అలవాటు చేసుకున్నారు. తాజాగా ఎప్‌స్టీన్ ఫైల్స్ పైనా దుమారం రేపుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో ప్రధాని పేరు పదేపదే ప్రస్తావనకు వచ్చిందని చెబుతున్న వారు అందులో ఏముందో తెలుసుకుని మాట్లాడితే బాగుండేది. ఇదంతే ఒక ఎత్తయితే దీని కారణంగానే మోడీ అమెరికాతో ట్రేడ్ డీల్ కుదుర్చుకున్నారన్న ప్రచారం చేపట్టారు. దీంట్లో రాహుల్, లెఫ్ట్ పార్టీలు ముందున్నాయి. నిజానికి ఎప్‌స్టీన్ ఫైల్స్ లో రాహుల్ పేరు కూడా ఉంది. దానిని ఆయనగాని, ఆయనకు వంతపాడుతున్న వారుగానీ మాట్లాడడం లేదు. అందులో రాహుల్‌ను ఓ అసమర్థ నేతగా వర్ణించారు. అతను రాజకీయాలకు పనికి రాడని, అతని వల్ల ఒరిగేదేమీ లేదని తేల్చారు. దీనిని మరుగున పర్చి మాట్లాడుతున్నారు. కనీసం రాహుల్ కూడా దీనిని తెలుసుకుని మాట్లాడితే బాగుండేది. అలాగే రాహుల్ భారత రాజకీయాల గురించి ఎప్‌స్టీన్ ఎవడు కామెంట్ చేయడానికి అన్న ప్రశ్న వేసుకోవాలి. అలాగే మిగతా వారి గురించి కూడా అతను వ్యాఖ్యానించడానికి అతని తాహతు ఏంటన్నది కూడా ముఖ్యం. ఇక ట్రేడ్ డీల్ గురించి మాట్లాడుకుంటే ట్రంప్ ఏనాడూ భారత్‌కు అనుకూలంగా వ్యవహరించ లేదు. 50శాతం సుంకాలు బాది చెవి మెలిపెట్టాడు. మాట్లాడడానికి కూడా భారత్ ప్రధానితో ఇష్టపడలేదు. అనూహ్యంగా ఆయన మారడానికి, ట్రేడ్ డీల్ కుదుర్చుకోవాలని అనుకోవడానికి కారణాలు ఉన్నాయి. ఒకటి అమెరికాలో భారత్‌కు మద్దతుగా అక్కడి నేతలు ట్రంప్‌పై అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. భారత్‌తో వాణిజ్యం తెంపుకుంటే మనం మటాష్ అవుతామని అంటున్నారు. అలాగే యూరోపియన్ యూనియన్‌తో భారత్ ట్రేడ్ డీల్ కుదుర్చుకోవడంతో ట్రంప్‌కు దిక్కుతోచకుండా పోయింది. అలాంటి ట్రంప్ టారిఫ్‌లను 18శాతానికి తగ్గించి భారత్‌తో కాళ్లబేరానికి వచ్చాడు. ఇక్కడ మోడీ ఎక్కడ ట్రంప్‌కు లొంగిపోయాడో, ఎక్కడ భారత్‌ను తాకట్టు పెట్టారో కాంగ్రెస్, కమ్యూనిస్టులు చెప్పాలి. ఈ పరిస్థితిలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నా డీల్ కుదుర్చు కునేదే. రాజకీయ అవగాహన లేకుండా మాట్లాడుతున్న వారికి దేశాం గురించి, ప్రపంచం గురించి తెలియదనుకోవాలి. రాహుల్ లాంటి విపక్ష నేత ఉన్నందుకు సిగ్గుపడాలి. ఎందుకంటే పార్లమెంట్‌లో గట్టిగా వాణి వినిపించలేకపోవడం, అల్లరి చేసి బయటకు రావడం మాత్రమే తెలిసిన అసమర్థుడు రాహుల్. ఇలాంటి వారి వల్‌్లనే దేశ ప్రతిష్టకు మచ్చగా మారుతోంది. బడా కార్పొరేట్ల ప్రయోజనాల కోసం మోడీ ప్రభుత్వం ఎంతవరకైనా వెళ్తుందని ట్రేడ్ డీల్ గురించి పదేపదే చెబుతున్న వారు సిగ్గుతో తలదించుకోవాలి. నిజానికి ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో అనేకరకాలుగా అందిరి పేర్లు ఉన్నాయి. వాటికి ఆధారాలు లేవు. ఓ వికృత వ్యక్తి, వ్యవభిచారి తనకు తానుగా రాసుకున్న కథలను చూపించి అంతా అక్కసు వెళ్లగక్కుతున్నారు. ముఖ్యంగా భారత విపక్షాలు ఈ విషయంలో ముందున్నారు. ఏ సందు దొరికినా మోడీని ఆడిపోసుకోవడమే పనిగా పెట్టుకున్నారు. నిజానికి పార్లమెంటులో ప్రజల సమస్యలను ప్రస్తావించి పోరాడాలన్న పట్టుదల లేని వారంతా ఎంపిలుగా ఉన్నారు. ప్రజల డబ్బును దోచేస్తున్నారు. పన్నుల రూపంలో కట్టిన డబ్బులను దుబారా చేస్తున్నారు. ఇవన్నీ మాట్లాడడానికి సమయం ఉండదు. ఇకపోతే ఎప్‌స్టీన్ లైంగిక నేరస్తుడిగా అంగీకరించి 18 నెలలపాటు జైలు శిక్షకు గురై, ప్రైవేట్ జెట్స్, ఐలాండ్స్ కొనుగోలు చేసే స్థాయికి ఎదిగిన జెఫ్రీ ఎప్‌స్టీన్ ప్రపంచ నేతలతో, కార్పొరేట్లతో సంబంధాలు నెరిపే బ్రోకర్. 2019లో రెండోసారి జైలుకు వెళ్లిన తరువాత ఆత్మహత్య చేసుకున్నాడని అమెరికా ప్రకటించింది. అయితే తమ సంబంధాలు బయటకు వస్తాయని ప్రముఖులే హత్య చేయించారన్నది అక్కడి మీడియా కథనం. జెఫ్రీ ఎప్‌స్టీన్ తనకుతాను రాసుకున్న వారి పేర్లలో మోడీ, రాహుల్, కేంద్ర మంత్రి హర్‌దీప్‌సింగ్ పురి, ముఖేష్ అంబానీ సోదరుడు అనిల్ అంబానీ పేర్లు ఉన్నాయని సమాచారం. మరి వీరందిరికి సంబంధించి అందులో ఏముందో ఎవరికీ తెలియదు. ఆ సందర్భంగా జరిపిన ఇ మెయిల్స్‌లో పదేపదే ప్రధాని పేరు ప్రస్తావనకు రావడం తదితర అంశాలపై ప్రజలకు వాస్తవాలు చెప్పాల్సిన బాధ్యత కేంద్రానిదే అంటూ చిలకపలుకులు పలుకుతున్న వారికి రాజకీయ నిబద్ధత లేదనుకోవాలి. 2014 జూన్ నుంచి 2017 మే మధ్య ఎప్‌స్టీన్‌తో అనేకసార్లు మెయిల్స్, చాట్స్ చేయడంతోపాటు మూడుసార్లు స్వయంగా కలిశారు. టెక్నాలజీ అభివృద్ధి కోసం, ఆ రంగంలో ప్రముఖులతో సంబంధాల కోసమే సంప్రదించానని, అతను నేరస్తుడని తెలీదని పురి చెబుతున్నారు. అప్పటికే ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైన క్రిమినల్ గురించి ఐఎఫ్ఎస్ మాజీ అధికారికి తెలియదనడం బుకాయింపున అంటున్నారు. అయితే అందులో బిల్‌గేట్స్, ట్రంప్, క్లింటన్, హిల్లరీ క్లింటన్ ఇలా ఎందరో ప ఏర్లు ఉన్నాయి. అప్పట్లో ఏదో సందర్భంలో అతనిని కలిసే ఉంటారు. అంతమాత్రాన అతనో సచ్చీలుడిగా, అతనికి పెద్ద హోదా ఆపాదించి మనలను మనం చిన్న చేసుకోవడం దారుణం. 2017 జులైలో ప్రధాని మోడీ ఇజ్రాయిల్‌లో పర్యటించడం మినహా మిగతాదంతా అబద్ధమని, ఆ నేరస్తుడి కల్పనలని పేర్కొంటూ కేంద్రం ఖండించింది. జెఫ్రీ ఎప్‌స్టీన్ ఇ మెయిల్స్‌కు సంబంధించిన అంతర్జాతీయ కథనాలపై స్పందించడం సరికాదు. ఎవరికి వారు ఏదో ఊహించుకుని ఎప్‌స్టిన్‌ను ఆకాశానికి ఎత్తడం, అతనో దేవదూతగా భావించడం దుర్మార్గం. ఒక లైంగిక వ్యభిచారి అయిన ఎప్‌స్టిన్ గురించి తెలుసుకుంటే మంచిది. ట్రంప్, బిల్ క్లింటన్ మొదలు ప్రపంచవ్యాప్తంగా అనేకమంది ప్రముఖుల చీకటి కోణాలను వెలుగులోకి వచ్చాయని అనుకోవడం కూడా అంతే పొరపాటు. ఇలాంటి కథనాలను వండివార్చే లెఫ్ట్ నేతలు దేశం గురించి ఆలోచిస్తే మంచిది. ముందుగా రాహుల్ పేరు ఎందుకు ప్రస్తావనకు వచ్చిందో నిలదీస్తే మంచిది. మోడీని నిందించాలనుకుంటే పార్లమెంటులో నిలదీయండి. అతని నిర్ణయాలను తిప్పికొట్టండి. పార్లమెంటులో మాట్లాడడం చేతకాని నేతలంతా జెఫ్రీ ఎప్‌స్టీన్ అనే ఓ వ్యభిచారి కథనాలకు ప్రాధాన్యం ఇవ్వడం, అదికూడా అతను ఈ భూమ్మీద లేడు కనక వివరాలు ఇవ్వలేడు కనుక బురదజల్లడం సరికాదు.

# ఇష్టం లేనప్పుడు చెప్పలేం

## గర్భం కొనసాగించాలని ఎలా అంటాం ● మైనర్ కేసులో సుప్రీం కీలక వ్యాఖ్యలు




**న్యూఢిల్లీ:** సంతానోత్పత్తికి సంబంధించి మహిళలు స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే హక్కును సుప్రీంకోర్టు సమర్థించింది. ఇష్టం లేకుండా గర్భం కొనసాగించాలని ఏ మహిళను ఒత్తిడి చేయలేమని స్పష్టం చేసింది. మైనర్‌గా ఉన్నప్పుడు గర్భవతైన ఓ యువతి 30 వారాల గర్భాన్ని తొలగించేందుకు అత్యున్నత న్యాయస్థానం శుక్రవారం అనుమతించింది. గర్భ విచ్ఛితికి అనుమతిని నిరాకరిస్తూ ముంబై హైకోర్టు ఇంతకుముందు ఇచ్చిన ఆదేశాలను జస్టిస్ బీవీ నాగర్నత సారథ్యంలోని సుప్రీం ధర్మాసనం కొట్టివేసింది. మహారాష్ట్రకు చెందిన బాలిక తన బాయ్‌ఫ్రెండ్‌తో రిలేషన్ కారణంగా కొన్ని నెలల క్రితం గర్భవతైంది. అప్పటికి ఆమెకు 17 ఏళ్లు. ప్రస్తుతం 18 ఏళ్ల నాలుగు నెలలు. 30 వారాల గర్భిణి. అయితే గర్భాన్ని కొనసాగించాలని తాను కోరుకోవడం లేదంటూ ముంబై హైకోర్టును ఆమె ఆశ్రయించింది. అయితే ప్రెగ్నెన్సీ చట్టం ప్రకారం గడువు మించిపోయిందంటూ హైకోర్టు ఆమె విజ్ఞప్తిని తోసిపుచ్చింది. దీంతో ఆ బాలిక సుప్రీంకోర్టును ఆశ్రయించింది. బాలిక తరఫు న్యాయవాది కోర్టులో తన వాదన వినిపిస్తూ, ప్రెగ్నెన్సీని కొనసాగించాలని ఒత్తిడి చేస్తే సామాజిక కళంకం తలెత్తే అవకాశం ఉండవచ్చనే కారణంగా ఆమె మానసిక ఆందోళనకు గురికావచ్చన్నారు. ఇరువైపులా వాదనలు విన్న ధర్మాసనం.. గర్భవిచ్ఛితికి నిర్ణయం తీసుకోవడం ఆలస్యమైనప్పటికీ అప్పీలుదారు హక్కును తప్పనిసరిగా పరిరక్షించాల్సి అంటుందని పేర్కొంది. ఆమె ఇష్టం లేకుండా గర్భాన్ని కొనసాగించాలనడం చట్టవిరుద్ధమని స్పష్టం చేసింది. గర్భవిచ్ఛితికి అనుమతించినా అమ్మాయికి ఎలాంటి ప్రమాదం ఉండదని వైద్యులు ఇచ్చిన నివేదికను పరిగణనలోకి తీసుకున్నట్టు పేర్కొంది. యువతి నుంచి లిఖితపూర్వక అండర్‌టేకింగ్ తీసుకోవాలని, గర్భవిచ్ఛితికి వైద్యులను అనుమతిస్తున్నామని తీర్పు వెలువరించింది.

# ప్రజలే మిమ్ములను వద్దనుకున్నారు

## ఇప్పుడు న్యాయవేదికను ప్రచారానికి వాడుకుంటారా

## ప్రశాంత్ కిశోర్‌కు చీఫ్ జస్టిస్ చురకలు



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6:** ప్రశాంత్ కిశోర్‌కు చెందిన జన్ సురాజ్ పార్టీకి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. గతేడాది బిహార్‌లో జరిగిన ఎన్నికల ఫలితాన్ని సవాల్ చేస్తూ ఆ పార్టీ వేసిన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. ఈ సందర్భంగా ప్రజలే మీ పార్టీని వద్దనుకున్నారంటూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ చురకలంటించారు. ఇప్పుడు ఈ న్యాయవేదికను ప్రచారానికి వాడుకుంటున్నారా అని ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల్లో 238 స్థానాల్లో పోటీకి దిగిన ప్రశాంత్ కిశోర్ పార్టీ.. ఒక్క సీటు కూడా దక్కించుకోలేకపోయింది. ఇందులో ఎన్డీయే కూటమి ఘన విజయాన్ని సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. అయితే, గెలిచిన కూటమి సభ్యులు ఎన్నికల్లో ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించి.. ఒక్కో మహిళకు రూ.10వేలు పంపిణీ చేశారని జన్ సురాజ్ పార్టీ పిటిషన్‌లో ఆరోపించింది. ఈ క్రమంలో కూటమి గెలుపు చెల్లదని ప్రకటించాలని ఆ పార్టీ కోరింది. అయితే జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించేందుకు నిరాకరించింది. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ.. 'మేము ఇలాంటి నోటీసులు జారీ చేయలేం. ఎన్నికల్లో ఓడిపోయారు కాబట్టి.. మొత్తం ఫలితాన్ని పక్కన పెట్టాలని మీరు కోరుతున్నారు. ఇలాంటి అంశాలపై రాజకీయ పార్టీలు కాకుండా.. సామాన్యులు కోర్టుకు రావడాన్ని మేం స్వాగతిస్తాం. ఒకవేళ.. మీ పార్టీ అధికారంలోకి వచ్చినా మీరూ అదే చేస్తారు' అని వ్యాఖ్యానించారు. ఇంకా ఏమైనా ఫిర్యాదులు ఉంటే బిహార్ హైకోర్టును ఆశ్రయించాలని ధర్మాసనం సూచించింది.

# రెపోరేట్‌లో కానరాని మార్పులు

## యధాతథంగా ద్రవ్యపరపతి విధానం

## ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా




**ముంబై, ఫిబ్రవరి 6:** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక వడ్డీరేట్లలో ఎలాంటి మార్పు చేయలేదు. మునుపటి వడ్డీరేట్లను యథాతథంగా ఉంచింది. ఈ మేరకు శుక్రవారం ద్రవ్య పరపతి విధాన సమీక్షలో తీసుకున్న నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా శుక్రవారం వెల్లడించారు. ఈసారి రెపో రేటులో ఎలాంటి మార్పు లేదని, 5.25 శాతం వద్దే కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కేంద్రం బ్జడెట్‌ను ప్రవేశపె ట్టిన తర్వాత ఆర్‌బీఐ నిర్వహించిన తొలి ద్వైమాసిక సమీక్ష ఇది. గత ఏడాది ఈ వడ్డీరేట్లను రిజర్వ్ బ్యాంక్ పలుమార్లు సవరించింది. 2025 ఫిబ్రవరి, ఏప్రిల్‌లో కీలక వడ్డీరేట్లను 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గించిన ఆర్‌బీఐ.. జూన్ సమీక్షలో ఏకంగా 50 బేసిస్ పాయింట్లు కోతపెట్టింది. ఆ తర్వాత డిసెంబర్‌లో మరో పావు శాతం తగ్గించింది. దాంతో గత ఏడాది మొత్తంగా రెపో రేటు 1.25 శాతం వరకు దిగొ చ్చింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 7.4 శాతం వృద్ధి నమో దవుతుందని ఆర్బీఐ అంచనా వేసింది. వచ్చే ఆర్థిక సంవ త్సరం (2026-27) తొలి త్రైమాసికంలో 6.9 శాతం, రెండో త్రైమాసికంలో 7 శాతం వృద్ధి నమోదవ్వొచ్చని పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యో ల్బణం 2.1 శాతంగా ఉండొచ్చని తెలిపింది. అదేవిధంగా 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో 4 శాతం, రెండో త్రైమాసికంలో 4.2 శాతం ద్రవ్యోల్బణం నమోదు కావచ్చని అర్బీ ఐ అంచనా వేసింది. కాగా జనవరి చివరి నాటికి ఫారెక్స్ నిల్వలు 723.8 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. వ్యవస్థలో ద్రవ్య లభ్యత రోజువారీ సగటున రూ.75 వేల కోట్లుగా ఉంది.

# నేడు క్యాబ్ డ్రైవర్ల దేశవ్యాప్త సమ్మె

● కనీస వేతనాల అమలుకు డిమాండ్



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6:** కనీస ఛార్జీలు, డ్రైవర్ల పని పరిస్థితులపై ఓలా, ఉబర్, ర్యాపిడో డ్రైవర్లు శనివారందేశవ్యాప్త సమ్మెకు దిగనున్నారు. తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్ల యూనియన్‌తో పాటు వివిధ కార్మిక సంఘాల పిలుపుమేరకు ఈ సమ్మె నిర్వహిస్తున్నారు. కనీసం ఆరు గంటల పాటు డ్రైవర్లు ఈ సమ్మెలో పాల్గొంటారని కార్మిక సంఘాల ప్రతినిధులు పేర్కొన్నారు. సమ్మె కారణంగా దేశవ్యాప్తంగా క్యాబ్, ఆటో, బైక్ ట్యాక్సీ సేవలకు అంతరాయం ఏర్పడనుంది. సమ్మెలో పాల్గొనే డ్రైవర్ల సంఖ్యను బట్టి ఆయా ప్రాంతాల్లో సేవల్లో సమ్మె తీవ్రత కనిపించనుంది. కనీస ఛార్జీలు, గిగ్ వర్కర్ల పని పరిస్థితులను నిరసిస్తూ ఈ ఆందోళన చేపడుతున్నట్లు తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్ల యూనియన్ పేర్కొంది.క్యాబ్ సేవలను నియంత్రించేందుకు తీసుకొచ్చిన మోటార్ వెహికల్ అగ్రిగేటర్ గైడ్‌లైన్స్, 2025 ఉన్నప్పటికీ ఆయా ప్లాట్‌ఫామ్స్ మాత్రం ఇష్టానుసారం ఛార్జీలు నిర్ణయిస్తున్నాయని కార్మికసంఘాలు పేర్కొంటున్నాయి. కాబట్టి ప్రభుత్వమే జోక్యం చేసుకుని కనీస ఛార్జీలను నిర్ణయించాలని డిమాండ్ చేస్తున్నాయి. ప్రైవేటు వాహనాలను కమర్షియల్ అవసరాలకు వినియోగించడంపై చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు. డ్రైవర్ల ఆదాయానికి రక్షణ కల్పించడంతో పాటు, పని పరిస్థితుల మెరుగు కోరుతూ ఈ సమ్మె చేపడుతున్నారు. గతేడాది ఫిబ్రవరిలో దేశవ్యాప్తంగా ఫుడ్ డెలివరీ, క్విక్‌కామర్స్ వర్కర్లు సమ్మె చేపట్టిన సంగతి తెలిసిందే. దీంతో కేంద్రం చొరవ తీసుకుని 10 నిమిషాల డెలివరీ హామీని తొలగించాలని ఆయా కంపెనీలకు సూచించింది. దీంతో బ్లింకిట్, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్, జెప్టో 10 నిమిషాల హామీని తొలగించాయి.

# ఇస్లామబాద్‌లో ఆత్మాహుతి దాడి

సుమారు 25మంది దుర్మరణం

**ఇస్లామాబాద్, ఫిబ్రవరి 6:** పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో భారీ పేలుడు సంభవించింది. షెహజాద్ టౌన్ ఏరియా టేర్లాయి ఇమామ్ బారగాహ్ వద్ద జరిగిన ఈ పేలుడులో సుమారు 25మంది మరణించగా.. 80 మందికి పైగా గాయపడినట్టు తెలుస్తోంది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని స్థానిక అధికారులు చెబుతున్నారు. ఇది ఆత్మాహుతి బాంబర్ దాడిగా అనుమానిస్తున్నారు. సమాచారం తెలిసిన వెంటనే పెద్దఎత్తున భద్రతా బలగాలు ఆ ప్రాంతానికి చేరుకుని తక్షణ సహాయక చర్చలు చేపట్టాయి. క్షతగాత్రులను పాకిస్థాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కు తరలిస్తున్నారు. ప్రస్తుతం సహాయక చర్చలు కొనసాగుతున్నాయి. శుక్రవారం నాడు ప్రార్థనల అనంతరం ఈ ఆత్మాహుతి దాడి జరిగినట్టు చెబుతున్నారు. ఇది బలోచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్‌ఏ) పనిగా అనుమానిస్తున్నారు. దాడి నేపథ్యంలో ఇస్లామాబాద్‌లో అత్యవసర పరిస్థితిని అధికారులు ప్రకటించారు. గత మూడు నెలల్లో ఇస్లామాబాద్‌లో ఆత్మాహుతి దాడులు జరగడం ఇది రెండోసారి. గతేడాది నవంబర్‌లో ఇస్లామాబాద్ జిల్లా జ్యుడిషియల్ కాంప్లెక్స్ వద్ద జరిగిన ఆత్మాహుతి దాడిలో 12 మంది మరణించగా.. 27 మంది గాయపడ్డారు.





# ‘అమ్మతోడు’ ఒట్టేసి చెబుతున్నా!

## మా 22వ వార్డు ప్రజలకు ‘అమ్మవారి’ పూజా సామాగ్రే ఇచ్చిన..

## ‘పోచమ్మ బోనాలు’ తీసేందుకు సంకల్పిస్తే ఇంత ‘కుట్ర’నా?

## ఇందులో కూడా ‘భూతద్దం’ పెట్టి చూస్తున్నారు

## రాజకీయమంటే ఇలా కూడా ఉంటుందా?

- వార్డు ప్రజలకు ఎంతో చేశా..’కరోనా టైం’లో ప్రాణాలకు తెగించి ‘అంత్యక్రియలు’ నిర్వహించా..
- నా వార్డు ప్రజల కోసం ‘పోచమ్మ గుడి’ కట్టిస్తాని నిర్ణయించుకున్న
- ఈ గరీబోడి ఎదుగుదలను ఓర్వలేకనే రకరకాల ‘కుట్రలు-కుతంత్రాలు’ చేస్తున్నారంటూ.. ‘మాజీ కౌన్సిలర్’ మాడవేణి నరేష్ కన్నీటి వీడియో వైరల్
- మీ వెంట మేమున్నాం అని మేమున్నాం.. ‘పోచమ్మకు బోనాలు’ తీద్దామని వార్డు మహిళల మద్దతు



కోరుట్ల మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా 22వ వార్డులో ఒక భావోద్వేగ ఎపిసోడ్ పట్టణంలో చర్చానీయాంశమైంది.మాజీ కౌన్సిలర్ మాడవేణి నరేష్ కన్నీటి వీడియో వైరల్.. పూజా సామాగ్రి పంపిణీపై దుష్ప్రచారం ఆరోపణల వ్యవహారం హాట్ టాపిక్ అయింది!

- నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య)

### కన్నీటి వీడియోలో నరేష్ ఆవేదన

మాడవేణి నరేష్ విడుదల చేసిన వీడియోలో తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. “అమ్మతోడు.. ఒట్టేసి చెబుతున్నా” అంటూ మొదలు పెట్టిన ఆయన, 22వ వార్డు ప్రజలకు ‘అమ్మవారి’ పూజా సామాగ్రి ఇచ్చినందుకు ప్రత్యర్థులు దుష్ప్రచారం చేస్తూ.. వార్డు ప్రజలను తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. “పోచమ్మ బోనాలు తీసేందుకు సంకల్పిస్తే ఇంత కుట్రనా.? ఇందులో కూడా భూతద్దం పెట్టి చూస్తున్నారు. రాజకీయమంటే ఇలా కూడా ఉంటుందా?” అని ప్రశ్నించారు.

### కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి..

తాను వార్డు ప్రజల కోసం ఎంతో చేశానని, కరోనా కాలంలో ప్రాణాలకు తెగించి ... పట్టణంలో కరోనా సమయంలో చనిపోయిన వారి అంత్యక్రియలు నిర్వహించానని గుర్తుచేశారు. “నా వార్డు ప్రజల కోసం పోచమ్మ గుడి కట్టిస్తానని నిర్ణయించుకున్న.. ఈ గరీబోడి ఎదుగుదలను ఓర్వలేక రకరకాల కుట్రలు-కుతంత్రాలు చేస్తున్నారు” అని వాపోయారు. తనను నా శత్రువులు పనిగట్టుకుని ఇబ్బందులు పెడుతున్నారని ..తనకు తల్లిదండ్రులు లేరని..ఉంటే పట్టుకుని ఏడవాలని ఉందని, వార్డు ప్రజలే తన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులని కన్నీళ్ల మధ్య చెప్పుకొచ్చారు.!





### ప్రత్యర్థుల మాస్టర్ ప్లాన్ ఆరోపణ

కోరుట్ల మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి మాడవేణి స్వప్న గెలుపు బాటలో ఉండటంతో ప్రత్యర్థులు మాస్టర్ ప్లాన్ వేశారని నరేష్ ఆరోపించారు. సదుద్దేశంతో రూ.50 విలువ గల పూజా సామాగ్రి పంపిణీ చేస్తే, అది తప్పు అని దుష్ప్రచారం చేసి చావుదెబ్బ కొట్టాలని పావులు కదిపారని విమర్శించారు. “నేను అందరినీ నా వాళ్లని అనుకున్నాను. నాతోటి వారికి ఆంజనేయ స్వామి గుడికి అధ్యక్షులు అయ్యేలా సహకరించాను. అందరూ బాగుండాలని, ఐక్యంగా ఉండాలని సంకల్పిస్తే.. తానోటి తలిస్తే దైవమోటి తలిచినట్టు.. నన్ను శత్రువుగా భావించినవారు నా ఓటమికి కుట్రపన్నుతున్నారు” అని ఆవేదన వ్యక్తం చేశారు.





#### పోచమ్మకు బోనాలు తీద్దాం..

### మీ వెంట మేమున్నాం

#### మాడవేణి స్వప్న-నరేష్ దంపతులకు మహిళల మద్దతు

నరేష్ వీడియో వైరల్ కావడంతో వార్డు ప్రజలు, ముఖ్యంగా మహిళలు ముందుకొచ్చారు. “పోచమ్మకు బోనాలు తీద్దాం.. మీ వెంట మేమ-ున్నాం” అంటూ మద్దతు తెలిపారు. ఎన్నికల తర్వాత కాదు, ఈ వచ్చే ఆదివారమే సామూహికంగా పోచమ్మ బోనాలు తీసేందుకు సిద్ధపడ్డారు. గత ఐదేళ్లుగా నరేష్ తమతో కలిసి ఉన్నారని, ఏ అవసరం వచ్చినా, ఆపద వచ్చినా అందుబాటులో ఉంటూ సేవ చేశారని పేర్కొన్నారు.”ఇప్పుడు కూడా మేమంతా మీ వెంట ఉంటాం.. మేం గెలిపించుకుంటాం.. మాదీ బాధ్యత” అని స్వప్న-నరేష్ దంపతులకు భరోసా ఇచ్చారు. “మీరే నా సర్వస్వం! మీరు మంచి మనసు చేసుకుని, పెద్దమనసుతో ఆశీర్వదించి గెలిపించండి.. మీ కుటుంబ సభ్యుల్లా ఆదరించండి.. మీ అందరికీ పాదాభివందనం” అంటూ నరేష్ విజ్ఞప్తి చేశారు.

జగిత్యాల జిల్లాలోని కోరుట్ల మున్సిపల్ ఎన్నికలు రాజకీయంగా హీటెక్కుతున్న నేపథ్యంలో బీజేపీ అభ్యర్థి మాడవేణి స్వప్న భర్త, మాజీ కౌన్సిలర్ మాడవేణి నరేష్ విడుదల చేసిన కన్నీటి వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వార్డు ప్రజలకు రూ.50 విలువైన పూజా సామాగ్రి పంపిణీ చేసినందుకు ప్రత్యర్థులు దుష్ప్రచారం చేస్తున్నారని, తన గరీబీ ఎదుగుదలను ఓర్వలేక కుట్రలు చేస్తున్నారని భావోద్వేగంతో వాపోయారు. తనకు తల్లిదండ్రులు లేరని, వార్డు ప్రజలే తన కుటుంబమని చెప్పుకొచ్చారు. ఇది తప్పైతే రాజకీయాల నుంచి తప్పుకుంటానని ప్రకటించారు. మరోవైపు వార్డు మహిళలు ముందుకొచ్చి, ఎన్నికల ముందే సామూహిక పోచమ్మ బోనాలు తీసేందుకు మద్దతు తెలుపుతూ భరోసా ఇచ్చారు.

### ఎన్నికల నేపథ్యం

కోరుట్ల మున్సిపల్ ఎన్నికలు తీవ్ర పోటీగా సాగుతున్నాయి. బీజేపీ అభ్యర్థి మాడవేణి స్వప్న బలమైన పోటీదారిగా నిలుస్తున్న నేపథ్యంలో ఈ ‘భావోద్వేగ ఎపిసోడ్’ ఓటర్ల మనసులపై ప్రభావం చూపే అవకాశం ఉంది. నరేష్ వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుండటంతో ఎన్నికల ఫలితాలపై దాని ప్రభావం ఎలా ఉంటుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.!







# ‘జిందం’ అన్న!
# ‘జిందాతిలిస్మాత్’లాంటోడు!!



## అతను ‘ప్రజల మనిషి’..

### ఆయనకు ‘సేవే లక్ష్యం - ప్రేమే మార్గం’

**కోరుట్లకు ‘గుండెకాయ’ లాంటి 32 వార్డు కౌన్సిలర్ ‘జిందం లక్ష్మీనారాయణ’ ఆదర్శ ప్రస్థానం ఇదీ!**

నిజంగా నిజం.! ‘జిందం’ అన్న.. ‘జిందాతిలిస్మత్’ అసుంటి మనసున్న మారాజు.! కోరుట్ల మున్సిపల్ పరిధిలో 32వ వార్డు ‘గుండెకాయ’లాంటిది. ఇలాంటి వార్డుకు కౌన్సిలర్ గా గెలుపొంది ఐదేళ్లపాటు చక్కని ‘ప్రజా పాలన’ అందించిన ‘జిందం లక్ష్మీనారాయణ’ ఆదర్శ ప్రస్థానం పై ‘నేటి సాక్షి’ అందిస్తోన్న ‘ప్రత్యేక కథనం’ మీకోసం.. చదవండి మరి.!

- నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య)



### సామాన్యుడే.. సమాజసేవకుడై..

ఇది.. సామాన్య కార్యకర్తగా మొదలై.. ప్రజాభిమానంతో 32వ వార్డు కౌన్సిలర్‌గా ఎదిగిన జిందం లక్ష్మీనారాయణ జీవిత ప్రయాణం ఒక నిజమైన స్ఫూర్తిదాయక గాథ.!కుటుంబ సభ్యుల ఆశీస్సులు, గురువుల మార్గదర్శకత్వం, సహచరుల సహకారంతో సామాజిక సేవ నుండి రాజకీయ రంగంలోకి అడుగుపెట్టి, 2015లో ప్రముఖ యువజన సంఘం అధ్యక్షుడిగా ప్రారంభమై, పద్మశాలి సంఘం, చేయూత స్వచ్ఛంద సంస్థ ద్వారా సేవలు అందించారు. 2020లో భారీ మెజార్టీతో కౌన్సిలర్ గా ఎన్నికై, కరోనా సమయంలో నిత్యావసరాల పంపిణీ, క్రీడా మైదానాలు, రోడ్లు-డ్రైనేజీ, సంక్షేమ చెక్కులు, ఇందిరమ్మ పథకం ద్వారా సొంత ఇళ్ల మంజూ రు వంటి విజయాలతో వార్డు రూపురేఖ లనే మార్చేశారు.

2024 జులై 19న కాంగ్రెస్ పార్టీలో చేరి, రేవంత్ రెడ్డి విప్లవాత్మక నాయకత్వంలో అణగారిన వర్గాల గొంతుకగా నిలిచి, వంద శాతం అభివృద్ధి లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు.

### కుటుంబ నేపథ్యం.. పెద్దల ఆశీస్సులు

జిందం లక్ష్మీనారాయణ విజయానికి పునాదిరాళ్లు తన తల్లిదండ్రులైన జిందం చిన్న భూమయ్య కీ.శే. జిందం సరస్వతిలే.! వారి ఆశీర్వాదంతోపాటు..సమస్త కుటుంబ సభ్యులందరి అండదండలతో ప్రజా సేవలో ముందుకు సాగుతున్నారు. తన కుటుంబం అందించే ధైర్యమే ప్రజా క్షేత్రంలో నిలబెట్టిందని ఆయన కృతజ్ఞతాపూర్వకంగా స్మరించుకుంటారు. ఈ కుటుంబ బలమే ఆయన సేవా ఆదర్శానికి మూలస్తంభం.

### వృత్తి నుండి సామాజిక సేవ వైపు

2000 నుండి 2015 వరకు ఆర్.కె. గ్రూప్ చైర్మన్ ఎక్కల్ దేవి రాంకిషన్, కటుకం సురేందర్, చింతకింది సత్యనారాయణ, గంప నరేష్ మార్గదర్శకత్వంలో ఫీల్డ్ ఆఫీసర్ నుండి మేనేజర్ స్థాయి వరకు ఎదిగి తన నిబద్ధతను చాటుకున్నారు. ఆగస్టు 15, 2015న రుద్ర శ్రీనివాస్ అండ్‌బ్రదర్స్ ప్రోత్సాహంతో ప్రముఖ యువజన సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికై, ప్రజా సేవలో తొలి అడుగు వేశారు. ఈ మార్పు ఆయన జీవితంలో ఒక కీలక ‘టర్నింగ్ పాయింట్’ అయింది.



### సంఘ సేవలో కీలక బాధ్యతలు-మానవతా దృక్పథం

2015లో పద్మశాలి కులోన్నతి సంక్షేమ సంఘం కోశాధికారిగా, 2017లో కార్యదర్శిగా అత్యధిక మెజార్టీతో గెలుపొంది, కట్కం గణేష్, ఎక్కల్దేవి సుధాకర్, బండ్ల రవి, గంగుల సత్యర్తప్రకాశ్, జిల్లా ధనుంజయ్ , మిట్టపల్లి శ్రీనివాస్ బ్రదర్స్ , బాలె నర్సయ్య, చింతకింది హరిప్రసాద్ బ్రదర్స్, వాసాల గణేష్, భీమనాతి పరంధాం, పెండం గణేష్ , చెన్న విశ్వనాథశీ ,జిందం జనార్ధన్, మిట్టపల్లి ప్రసాద్ వంటి అనేక మంది సహకారంతో కుల బాంధవుల సంక్షేమానికి కృషి చేశారు.’ఆనంద వృద్ధాశ్రమం’లో కో-కన్వీనర్‌గా ద్యావనపల్లి ఆనందం ఆధ్వర్యంలో వృద్ధుల సేవ, ‘పోపా’ డైరెక్టర్‌గా కీ. సే.వాసం భూమానందం, అడ్వకేట్ చాప కిషోర్ , అందె శివప్రసాద్, గంగుల సత్యర్తప్రకాశ్,వంటి వారితో కలిసి బాధ్యతలు నిర్వహించారు. 2018లో చేయూత స్వచ్ఛంద సంస్థ ద్వారా కీ.శ.అల్లె సంజీవ్, కట్కం గణేష్ వంటి సహచరులతో రక్తదానం, అన్నదానం, ‘ముక్తి నిలయం’ ద్వారా గూడు లేని వారికి అండగా నిలిచారు. ఈ సేవలు ఆయన మానవతా దృక్పథాన్ని ప్రతిబింబిస్తాయి.



### రాజకీయ ప్రస్థానంలో మరో మలుపు

2019లో అన్నం అనిల్, గడ్డం మధు, సంగెం వెంకన్న, డాక్టర్ అనూప్ రావు, గుంటూక సాం బన్న, గుంటుక ప్రకాష్, గుడ్ల మనోహర్, చిలుక గంగారామ్, వంటి నాయకుల ప్రోత్సాహంతో, నాటి ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు ఆధ్వర్యంలో టీఆర్ఎస్ (నేటి బీఆర్ఎస్) పార్టీలో చేరారు. 2020 జనవరి 22న అతడి పుట్టిన రో జునా 32వ వార్డు ప్రజల ఆశీస్సులతో భారీ మె జార్టీతో కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. మారుతున్న రాజకీయ సమీకరణాల నేపథ్యంలో, ప్రజా సేవను విస్తరించాలనే సంకల్పంతో 19-07-2024న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి విప్లవాత్మక నాయకత్వంలో, జువ్వాడి నర్సింగరావు, కృష్ణారావు గార్ల ఆధ్వర్యంలో, అన్నం అనిల్, తిరుమల గంగాధర్, ప్రోత్సాహంతో కాంగ్రెస్ లో చేరారు.

### ఐదేళ్ల అభివృద్ధి ప్రస్థానంలో..మైలురాళ్లు

తన పరిధి చిన్నదే అయినా..’పెద్దల’ ఆశీస్సులతో తన వార్డులో ‘మైలురాళ్ల’ వంటి అభివృద్ధిని చేసి చూపించారు. జూనియర్ కాలేజీ గ్రౌండ్‌లో రూ.30 లక్షల ఖర్చుతో జిమ్, విద్యుత్ స్తంభాలు, వాలీబాల్-క్రికెట్ కోర్టులు సి. సి. కెమెరా లతో నిర్మింపజేశారు.కరోనా సమయంలో ప్రతి ఇంటికి నిత్యావసరాల పంపిణీ..జిల్లాలోనే మొదటిసారి ‘సానిటేషన్ లిక్విడ్’ను తయారు చేసి పంపిణీ చేసి గుర్తింపు పొందాడాయన. హనుమాన్ మందిరం, ఈద్గా మసీదుల అభివృద్ధి చేయించారు.అదేవిధంగా ఐబి గెస్ట్ హౌస్ అభివృద్ధి..రూ.80 లక్షల సీసీ రోడ్లు-డ్రైనేజీ.. రూ.20 లక్షలతో ప్రభుత్వ ఆసుపత్రి ముందు 20 నిరుపేదలకు దుకాణాలు.. మరియు 100 పడకల ఆసుపత్రి మరియు 500 మందికి పైగా కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్, ఎల్ఓసీ, సీఎంఆర్ఎఫ్ చెక్కులు, పింఛన్లు, ట్రై సైకిల్స్, బైకులు.. ఇందిరమ్మ పథకం ద్వారా మొదటి విడతలో 21 మందికి రూ. 5 లక్షల చొప్పున సొంత ఇళ్లు మంజూరు చేయించారు. అందుబాటులో ఉంటూ, అభివృద్ధి చేసే నాయకుడిగా సాగుతున్న ప్రస్థానం ప్రతి ఒక్కరికీ ఆదర్శం.!



### వార్డు ప్రజల ఆశీస్సులే మరోసారి గెలిపిస్తాయి

**- జిందం లక్ష్మీ నారాయణ**

నా 32 వార్డు ప్రజల ఆశీస్సులే నా ప్రధాన బలం. వార్డులో వంద శాతం అభివృద్ధి, నిరుపేదలందరికీ సొంతింటి కల నెరవేర్చడమే నా ముందున్న లక్ష్యం. ఐదేళ్ల పాటు కడుపులో పెట్టుకుని కాపాడుకున్న మీరు.. మరోసారి నన్ను గెలిపించి మీ సేవలో తరించుకునేందుకు అవకాశం కల్పించండి.!



# ధనబలం వర్సెస్ దశాబ్దాల నమ్మకం

- ఎన్నికల వేళ మెట్‌పల్లిలో మారుతున్న రాజకీయ సమీకరణాలు
- టికెట్ల రాజకీయాలు.. కేడర్ ఆగ్రహం.. బలపడుతున్న స్వతంత్రులు - ప్రజాతీర్పు ఎటు?




**నేటి సాక్షి - కోరుట్ల(రాధారపు నర్సయ్య):** మున్సిపల్ ఎన్నికల వేళ మెట్‌పల్లి, కోరుట్ల పట్టణాలు రాజకీయంగా వేడెక్కుతున్నాయి. టికెట్ల కేటాయింపులో పార్టీలు అనుసరిస్తున్న విధానంపై క్షేత్రస్థాయి కార్యకర్తల్లో అసంతృప్తి పెరుగుతోంది. ఈ పరిస్థితి రెబల్ రాజకీయాలకు దారితీస్తూ, స్వతంత్ర అభ్యర్థుల ఉత్థానానికి కారణమవుతోంది. ఫలితంగా ఈ ఎన్నికలు సాధారణ స్థానిక సంస్థల పోటీగా కాకుండా పార్టీల భవిష్యత్తుకు పరీక్షగా మారుతున్నాయి.

### టికెట్ - గెలుపు ఫార్ములానా? లేక గౌరవమా?

రాజకీయాల్లో టికెట్ కేటాయింపు కేవలం గెలుపు–ఓటముల గణాంకాలకే పరిమితం కాదని స్థానిక కార్యకర్తలు అంటున్నారు. ఏళ్ల తరబడి పార్టీ కోసం పని చేసిన విధేయులను పక్కన పెట్టి 'ధనబలం', 'గెలిచే అభ్యర్థులు' పేరుతో కొత్త నాయకులకు టికెట్లు ఇవ్వడం అసంతృప్తికి దారితీస్తోంది. ఈ అసంతృప్తి రెబల్ అభ్యర్థిత్వాలు, స్వతంత్ర పోటీ రూపంలో బయటపడుతోంది.

### ప్రచారంలో పార్టీల మధ్య స్పష్టమైన తేడా

ప్రస్తుత ప్రచారాన్ని గమనిస్తే ప్రధాన పార్టీల మధ్య స్పష్టమైన వ్యత్యాసం కనిపిస్తోంది. బీఆర్‌ఎస్ నాయకత్వం క్షేత్రస్థాయిలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ కేడర్‌కు ధైర్యం నింపే ప్రయత్నం చేస్తోంది.

### కాంగ్రెస్ ప్రచారంపై విమర్శలు

కాంగ్రెస్ పార్టీ ప్రచార రథాలు, సభలు నిర్వహిస్తున్నప్పటికీ, ఓటర్లతో నేరుగా మమేకం కావడంలో లోపాలు ఉన్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. కేడర్‌లో అసంతృప్తి పెరుగుతోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### బీజేపీ ఉనికే ప్రశ్నార్థకం

మెట్‌పల్లిలో బీజేపీ ప్రచార కదలికలు పెద్దగా కనిపించకపోవడం పార్టీకి ప్రధాన బలహీనతగా మారిందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

### డబ్బుతో టికెట్.. నమ్మకంతో ఓటు

ఓటర్లు మాత్రం కష్టకాలంలో తోడుగా నిలిచిన నాయకులకే ప్రాధాన్యత ఇస్తున్నారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. వ్యక్తిగత ఇమేజ్ ఉన్న స్వతంత్ర అభ్యర్థుల వైపు ఓటర్లు మొగ్గు చూపుతున్నట్టు ప్రచారంలో కనిపిస్తోంది.

### రెబల్స్ కాదు.. ప్రత్యామ్నాయ నాయకత్వం

టికెట్ రాకపోవడంతో స్వతంత్రంగా బరిలోకి దిగిన అనుభవజ్ఞులైన కార్యకర్తలు ప్రజల్లో ఆదరణ పొందుతున్నట్టు తెలుస్తోంది. వారిని కేవలం ఓట్లు చీల్చే అభ్యర్థులుగా కాకుండా ప్రత్యామ్నాయ నాయకత్వంగా చూడడం గమనార్హం.

### పార్టీలకు హెచ్చరికగా మెట్‌పల్లి ఫలితాలు

కిందిస్థాయి కార్యకర్తలను విస్మరిస్తే పార్టీ పునాదులే కదిలిపోతాయన్న సంకేతాలను మెట్‌పల్లి రాజకీయాలు ఇస్తున్నాయి. ఈ ఎన్నికల ఫలితాలు ఇతర పట్టణాలపై కూడా ప్రభావం చూపే అవకాశముంది.

### ప్రజాతీర్పు ఏ వైపు?

ధనబలం వైపా? లేక దశాబ్దాల నమ్మకం, సేవ, అనుబంధం వైపా? అన్న ప్రశ్నకు సమాధానం త్వరలోనే వెలువడనుంది. మెట్‌పల్లి ఎన్నికలు రాష్ట్ర రాజకీయాలకు కీలక సంకేతం ఇవ్వనున్నాయి.

# జాతీయ ఉపాధి హామీ పథకంకు మహాత్మా గాంధీ పేరు కొనసాగించాలి

- జాతీయ ఉపాధిహామీ పేరు మార్పు చేయొద్దని వినతిపత్రం
- జేఏసీ నాయకులు మందడి ఇజ్రాయిల్



**నేటి సాక్షి తిరుమలాయపాలెం, మెట్టు రుద్రరాజు:** కేంద్ర ప్రభుత్వం బీజేపీ మహాత్మా గాంధీ ఉపాధిహామీ పథకం పేరు మార్చాలని చేస్తున్న కుట్రపూరితమైన చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని పాలేరు నియోజకవర్గ జేఏసీ సంఘాల నాయకులు మందడి ఇజ్రాయిల్ అన్నారు. తిరుమలయపాలెం మండలకేంద్రంలో శుక్రవారం మండల అధికారి పీడీపీ శ్రీదేవీ ను మందడి ఇజ్రాయిల్ ఆధ్వర్యంలో జేఏసీ సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి మహాత్మా గాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం పేరులో ఎటువంటి మార్పులు చెయ్యకుండా యధావిధిగా పేరు కొనసాగేవిధంగా చూడాలని వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం లో ఫీల్డ్ ఆఫీసర్లుగా విధులు నిర్వహిస్తున్న వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పర్మినెంట్ చెయ్యాలని కోరారు కేంద్ర ప్రభుత్వం బీజేపీ కుట్రపూరితంగా వ్యవహరించి మహాత్మా గాంధీ ఉపాధిహామీ పథకం పేరు మార్చాలని చూస్తే ఏటువంటి ఉద్యమం చేయడానికైనా జేఏసీ సంఘాలు సిద్దంగా ఉన్నాయని వెనకడే ప్రసక్తేలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు షేక్ మియా పంది అంజయ్య షేక్ సలీహా బేగం అల్లి గీత ఎస్‌కె శిలార్,లంజపల్లి వీరస్వామి, పోలేపొంగు నాగేశ్వరరావు నేతగాని ప్రభాకర్,ఎస్.కె పాషా,గుగులోత్ పాప,తదితరులు పాల్గొన్నారు.

# జూపెడలో నూతన సంత ప్రారంభం





- సర్పంచ్ వనవాసం నరేందర్ రెడ్డి

**నేటి సాక్షి తిరుమలాయపాలెం:** మండల పరిధిలోని జూపెడ గ్రామ ప్రజల సౌకర్యార్థం నూతనంగా ఏర్పాటు చేసిన సంతను శుక్రవారం గ్రామ సర్పంచ్ వనవాసం నరేందర్ రెడ్డి ఘనంగా ప్రారంభించారు. జూపెడ సెంటర్లో ఇకపై ప్రతి శుక్రవారం ఈ సంత కొనసాగుతుందని ఆయన ప్రకటించారు. మధ్యవర్తుల జోక్యం లేకుండా రైతులు తమ పంటలను నేరుగా విక్రయించుకునే అవకాశం కల్పించారు. దీనివల్ల రైతులకు గిట్టుబాటు ధర లభించడమే కాకుండా, గ్రామ ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తుందని సర్పంచ్ తెలిపారు. స్థానిక ప్రజలతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు తాజా కూరగాయలు, ఆకుకూరలు మరియు ఇతర నిత్యావసరాలు తక్కువ ధరకే అందుబాటులోకి రానున్నాయి. దీనివల్ల సమయం, ప్రయాణ ఖర్చులు ఆదా అవుతాయని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. సంత ప్రారంభం సందర్భంగా కూరగాయలు విక్రయించడానికి వచ్చిన మహిళను సర్పంచ్ శాలువాతో సన్మానించి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు గంద్ర గోపాలరావు, ఎంపీటీసీ లంజపల్లి శ్రీనివాస్, వార్డు సభ్యులు అంబాల రామ్మూర్తి, లంజపల్లి శ్రీకాంత్ పాల్గొన్నారు. అలాగే గ్రామ పెద్దలు తిప్పారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మారెడ్డి, మల్లారెడ్డి, వెంకన్న మరియు పైనంపల్లి, రఘునాథపాలెం, సోలిపురం, కాకరవాయి తదితర గ్రామాల సర్పంచ్లు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## లింగాలలో వెంకటేశ్వర స్వామి ఆలయం నిర్వహించాలి

**తహసిల్దార్ జి.సుభద్రమ్మ కు వినతిపత్రం సమర్పించిన గ్రామస్తులు**



**నేటి సాక్షి పాములపాడు:** పాములపాడు మండలంలోని, లింగాల గ్రామంలో అంగన్వాడీ కేంద్రం ఎదురుగా ఉన్న సర్వేనెంబర్–55బి లో ఉన్న 12 సెంట్ల గవర్నమెంట్ స్థలంలో వేంకటేశ్వర స్వామి ఆలయం నిర్మించాలని కోరుతూ పాములపాడు మండల తహసిల్దార్ జి.సుభద్రమ్మ కు సర్పంచ్ మల్లేశ్వరెడ్డి, టైలర్ వెంకటేశ్వర్లు, గోపాల కృష్ణయ్య, బ్రహ్మయ్య ఆచారి, సోషల్ వర్కర్ నవీన్ కుమార్ గౌడ్, ఇల్లూరి శ్రీరాములు, బలవెంకటరమణ, ఇల్లురి శ్రీరాములు తదితరులు వినతి పత్రం సమర్పించడం జరిగింది.

## ఎంపీడీవో గుండె బాబుకు సన్మానం

**నరెడ్ల సీతారాంరెడ్డి కృతజ్ఞతలు**



**నేటి సాక్షి, కమలాపూర్ :** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) గుండె బాబును కానిపర్తి స్నేహ సేవా ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి నరెడ్ల సీతారాంరెడ్డి ఘనంగా సన్మానించారు. 2023 అక్టోబర్‌లో సర్పంచుల పదవీకాలం ముగియడంతో గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించిన నేపథ్యంలో కానిపర్తి, శంబునిపల్లి, కమలాపూర్ గ్రామపంచాయతీలకు ప్రత్యేక అధికారిగా గుండె బాబు బాధ్యతలు నిర్వర్తించారు. దాదాపు రెండు సంవత్సరాల పాటు క్రమశిక్షణ, నిజాయితీతో విధులు నిర్వహిస్తూ ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించి మంచి పేరు సంపాదించుకున్నారని ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. ఆయన సేవలను గుర్తించి సన్మానం చేయడం ఆనందదాయకమని మండల ప్రజలు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ సెక్రటరీ కన్నెబోయిన కిరణ్, డైరెక్టర్ జనగాని సాంబయ్య, కన్నెబోయిన రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## టాలెంట్ టెస్ట్



**నేటి సాక్షి చిలుకూరు :** చిలుకూరు మండల కేంద్రంలో ఏఐఎస్ఎఫ్ ఐవైఎఫ్ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్ లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు శుక్రవారం నిర్వాహకులు బహుమతులు అందజేశారు ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ టాలెంట్ టెస్టులతో విద్యార్థులలో దాగివున్న సృజనాత్మక వేలికి తేబడుతుందని అన్నారు ఈ కార్యక్రమంలో చేవూరు కొండలు తమనబోయిన నరేష్ కళాశాల కరస్పాండెంట్ మాదాల శ్రీధర్ భారత్ గ్యాస్ డీలర్ కొల్లు శ్రీను బెల్లంకొండ గోవర్ధన్ కందుల మధు సీరపురపు శ్రీను అంబాల వెంకటి తదితరులు పాల్గొన్నారు

## పోలీసుల ఫ్లాగ్ మార్చ్

**నేటి సాక్షి, కొమరం భీమ్ ఆసిఫాబాద్ :** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఆసిఫాబాద్ పట్టణంలోని ప్రధాన రహదారుల గుండా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ నితికా పంత్ ఐపీఎస్ మాట్లాడుతూ, ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా భరోసా కల్పించడమే ఫ్లాగ్ మార్చ్ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. పట్టణంలో సుమారు 60 మంది పోలీస్ సిబ్బందితో ఈ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించామని చెప్పారు. ఎక్కడైనా సమస్యాత్మక ఘటనలు చోటుచేసుకుంటే వెంటనే పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ టౌన్ ఇన్స్పెక్టర్ బాలాజీ వరప్రసాద్, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

## నామినేషన్ ఉపసంహరణ



**నేటి సాక్షి, కరీంనగర్ టౌన్:** కరీంనగర్ మున్సిపల్ ఎన్నికలు సందర్భంగా మీస రమాదేవి భీరయ్య తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నట్లు అధికారికంగా ప్రకటించారు. కాంగ్రెస్ నుంచి బీ ఫారం అందకపోవడంతోనే తాను పోటీ నుంచి తప్పుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మీస రమాదేవి భీరయ్య మాట్లాడుతూ.. తనకు బీఫారం రాకపోయినా కాంగ్రెస్ కోసం నిరంతరం కృషి చేస్తానని, పార్టీకి సంపూర్ణ మద్దతు అందిస్తానని స్పష్టం చేశారు. 48వ డివిజన్‌లో కాంగ్రెస్ భారీ మెజారిటీతో విజయం సాధించేందుకు తన వంతు పాత్రను పూర్తి స్థాయిలో నిర్వహిస్తానని వెల్లడించారు.

# చిత్తనూరు విత్తనాల కంపెనీని ఎత్తివేయాలి





- ఉప సర్పంచ్ నరేష్ కుమార్
- కాలుష్యంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపణ

**నేటి సాక్షి, నారాయణపేట, రిపోర్టర్: ఇమామ్ సాబ్** నారాయణపేట జిల్లాలోని మరికల్ మండలంలోని చిత్తనూరు విత్తనాల ఫ్యాక్టరీ నుంచి వెలువడుతున్న పొగ కారణంగా కాలుష్యం పెరిగి, దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ధన్వాడ మండలం మందిపల్లి గ్రామ ఉపసర్పంచ్ చెట్టు కింది నరేష్ కుమార్ తెలిపారు. శుక్రవారం ధన్వాడలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫ్యాక్టరీ నుంచి ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం సమయంలో అధికంగా దుర్వాసన వ్యాపిస్తోందని, విష గాలుల ప్రభావంతో పరిసర గ్రామాల్లో చెట్లు ఎండిపోతున్నాయని ఆయన ఆరోపించారు. ఈ పరిస్థితి కొనసాగితే ప్రజలకు అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉండడంతో పాటు రైతుల పంట దిగుబడులు కూడా తగ్గే ప్రమాదం ఉందని అన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు వెంటనే స్పందించి చిత్తనూరు విత్తనాల కంపెనీని ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ధన్వాడ, మరికల్ మండలాల్లో దశలవారీగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికల కోసం ఫ్లాగ్ మార్చ్



- ప్రజల్లో భద్రతా భావం పెంపొందించడమే లక్ష్యం: డీఎస్పీ రాములు
- ఎన్నికల సమయంలో పోలీసులకు సహకరించాలి - ప్రజలకు విజ్ఞప్తి

**నేటి సాక్షి - కోరుట్ల( రాధారపు నర్సయ్య ):** జగిత్యాల జిల్లాలో జరుగనున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు కోరుట్ల పట్టణంలో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.

### భద్రతా చర్యల్లో భాగంగా ఫ్లాగ్ మార్చ్

మున్సిపల్ ఎన్నికల సమయంలో ప్రజల్లో భద్రతా భావం పెంపొందించడం, శాంతిభద్రతలను పరిరక్షించడం లక్ష్యంగా కోరుట్ల పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఈ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి అక్రమాలు, గొడవలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలుగా పోలీసులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

### డీఎస్పీ రాములు హెచ్చరికలు, సూచనలు

ఈ సందర్భంగా మెట్‌పల్లి డీఎస్పీ రాములు మాట్లాడుతూ, ప్రజల్లో భద్రతా భావాన్ని పెంచేందుకే ఫ్లాగ్ మార్చ్ నిర్వహించామని తెలిపారు. ఎన్నికల కమిషన్ సూచించిన మార్గదర్శకాల ప్రకారం స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ఎన్నికలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో చట్ట విరుద్ధంగా ప్రవర్తించే వారిపై, గొడవలు సృష్టించేందుకు ప్రయత్నించే వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ రాములు హెచ్చరించారు. ఎన్నికల ప్రక్రియను భంగపెట్టే ప్రయత్నాలను సహించేది లేదని స్పష్టంగా తెలియజేశారు. ఎన్నికలు ప్రశాంతంగా, న్యాయంగా జరగాలంటే అన్ని వర్గాల ప్రజలు పోలీసు శాఖకు పూర్తి సహకారం అందించాలని డీఎస్పీ రాములు విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకారంతోనే ఎన్నికల ప్రక్రియ విజయవంతమవుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ ఫ్లాగ్ మార్చ్‌లో సీఐలు అనిల్ కుమార్, సురేష్ బాబు, ఎస్ఐలు చిరంజీవి, శ్రీధర్, కిరణ్ కుమార్, అనిల్, నవీన్, రామచంద్రం, పోలీస్ సిబ్బంది పాల్గొని పట్టణమంతా గస్తీ నిర్వహించారు.



# పకీరతాండ గ్రామపంచాయతీలో గ్రామసభ


- అభివృద్ధే లక్ష్యంగా చర్చలు
- సమస్యల గుర్తింపు, పరిష్కారాలే అజెండా
- సర్పంచ్ గుగులోతు కైలారవి



**నేటి సాక్షి మహబూబాబాద్:** నరసింహుల పేట మండలంలో పకీరతాండ గ్రామపంచాయతీ పరిధిలో గ్రామసభను గ్రామ సర్పంచ్ గుగులోతు కైలారవి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ కార్యదర్శి రవి గ్రామసభ అజెండాను సభలో చదివి వినిపించారు. తండాలో నెలకొన్న సమస్యలను గ్రామసభ ద్వారా గుర్తించి, చర్చించి, ఆమోదింప చేసుకుని పరిష్కార దిశగా అడుగులు వేయాలని ఆయన తెలిపారు. గ్రామసభను ఉద్దేశించి సర్పంచ్ గుగులోతు కైలారవి మాట్లాడుతూ, పకీరతాండతో పాటు అనుబంధ తండాల్లో ఉన్న ప్రతి సమస్యను సమగ్రంగా గుర్తించి తండాను అభివృద్ధి పథంలో నడిపించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఇప్పటికే రోడ్లకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించడంతో పాటు, విద్యుత్ స్తంభాలపై 50 వాట్ల ఎల్ఈడి బల్బులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే బొడ్డి తండా సమీపంలో 15 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయించడం ద్వారా విద్యుత్ సమస్యను కొంతవరకు పరిష్కరించినట్లు వివరించారు. పారిశుధ్యం, తాగునీటి సమస్యలను కూడా ప్రాధాన్యతగా తీసుకుని, గ్రామసభ ద్వారా ఆమోదం పొందించి తగిన చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ కిషన్ నాయక్ మాట్లాడుతూ, పకీరతాండ, బుడ్డి తండాల్లోని సమస్యలను సమగ్రంగా గుర్తించి పకీరతాండ గ్రామపంచాయతీని అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.

ఈ గ్రామసభలో వార్డ్ సభ్యులు గుగులోతు లత, కవిత, రవి, రాజేష్, సురేష్, పద్మ, పరెంగన్, మాజీ ఎంపీటీసీ రవి, తండా ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

# ప్రభుత్వ భూముల కబ్జాపై పోరాడదాం



- బీఆర్ఎస్ పిలుపు

**నేటి సాక్షి మహబూబాబాద్:** మండల కేంద్రంలో ప్రభుత్వ భూములు అక్రమంగా అన్యాక్రాంతం అవుతున్నాయని, వాటిని వెంటనే గుర్తించి కాపాడాలని బీఆర్ఎస్ నాయకుడు బండి రమేష్, కెవిపిఎస్ జిల్లా నాయకుడు మందుల యాకూబ్ డిమాండ్ చేశారు. భవిష్యత్తు తరాల హక్కుల కోసం ప్రభుత్వ భూములను రక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని వారు స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములపై కబ్జాలు పెరుగుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని నాయకులు ఆరోపించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ భూముల వివరాలను సమగ్రంగా పరిశీలించి, ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ భూములకు వెంటనే హద్దులు నిర్ణయించి, భవిష్యత్తులో ఆక్రమణలకు గురికాకుండా కంచె ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పాతూరి మధు రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు సురేష్, యువజన నాయకులు కరుణాకర్ రెడ్డి, సాయి తదితరులు పాల్గొన్నారు.

# ధన్వాడలో కుస్తీ పోటీల ఎంపిక



**నేటి సాక్షి, నారాయణపేట, ఇమామ్ సాబ్:** నారాయణపేట జిల్లా ధన్వాడ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అండర్-15 బాలబాలికల రెజ్లింగ్ (కుస్తీ) పోటీల ఎంపికలు నిర్వహించారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, గద్వాల, నారాయణపేట జిల్లాల నుండి సుమారు 100 మంది క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ధన్వాడ మండల విద్యాధికారి గాయత్రి, జెడ్పీహెచ్ఎస్ బాయ్స్ స్కూల్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ సెక్రటరీ రవికుమార్, వ్యాయామ దర్శకులు నెల్సన్ కుమార్, క్రీడాకారుల తల్లిదండ్రుల ప్రతినిధి బాల్ సింగ్ నాయక్, కోచ్ శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభను వెలికితీయడంలో ఇలాంటి ఎంపిక పోటీలు కీలకమని నిర్వాహకులు తెలిపారు. అండర్-15 విభాగంలో పెద్ద సంఖ్యలో క్రీడాకారులు పాల్గొనడం ఈ ప్రాంతంలో కుస్తీపై ఉన్న ఆసక్తిని ప్రతిబింబిస్తోందన్నారు. ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు.

# హిందూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సంతోష్

### ఉత్తర్వులు జరిచేసిన రాష్ట్ర అధ్యక్షులు రాజు



**నేటి సాక్షి - జగిత్యాల టౌన్(పూరెల్ల బాపు):** రాష్ట్ర హిందూ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మడిపోజు సంతోష్ నియామితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షులు కొడారి రాజు, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మండల భూపాల్ లు శుక్రవారం ఉత్తర్వులు జరిచేశారు. రాష్ట్రీయ హిందూ పరిషత్ సంస్థ ప్రయోజనాలు, సనాతన ధర్మ పరిరక్షణ లక్ష్యాల కోసం ఈ సంస్థ పనిచేస్తుందని రాష్ట్ర అధ్యక్షులు కొడారి రాజు తెలిపారు. హిందూ సమాజ ఐక్యతకు పాటుపడుతూనే, క్రమశిక్షణతో పనిచేయాలని ఆయన సూచించారు. నాపై నమ్మకంతో అప్పజెప్పిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్థానని, సనాతన ధర్మాన్ని పరిరక్షణకు కృషి చేస్తానని నూతన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మడిపోజు సంతోష్ అన్నాను.

# మల్లయ్య ఏకగ్రీవ ఎన్నిక



**నేటి సాక్షి ప్రతినిధి, చందుర్తి (సతీష్):** రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం మానాల గ్రామంలోని శ్రీ శంభులింగేశ్వర ట్రాక్టర్ యూనియన్ అధ్యక్షుడిగా దర్శనం గంగ మల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా తాటికొండ శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం మానాల గ్రామంలో యూనియన్ సభ్యులు నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో కొత్త పాలకవర్గాన్ని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా దర్శనం గంగ మల్లయ్య మాట్లాడుతూ, తనను ఏకగ్రీవంగా ఎన్నిక చేసిన సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. యూనియన్ అభివృద్ధి కోసం సభ్యులతో కలిసి పనిచేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దాసరి అశోక్, రాష్ట్ర ఓబీసీ సెల్ అధ్యక్షుడు జక్కు వంశీ, వార్డు సభ్యులు సంద రాజం, లకవత్ బాలు, వర్ణం శ్రీనివాస్, దర్శనం గంగాధర్, తూము రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# షీ టీం పై విద్యార్థులకు అవగాహన



**నేటిసాక్షి, మిర్యాలగూడ:** పట్టణంలోని రెడ్డి కాలనీలోని శాంతినికేతన్ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ కోలా శ్రీనివాస్ ఆధ్వర్యంలో, షీ టీం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీం ఏఎస్ఐ మాట్లాడుతూ, మహిళల రక్షణకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగపడే 'టీ-సేఫ్' యాప్ ను ప్రతి ఒక్కరూ తమ మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకుని వినియోగించాలని సూచించారు. మహిళల భద్రత, చట్టపరమైన రక్షణ అంశాలపై వివరించి, సమస్యలు ఎదురైనప్పుడు వెంటనే పోలీసులను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు సీఎం కప్పు క్రీడా పోటీలు

**మరికల్ మండల ఎంపీడీవో పృధ్వీరాజ్....**



**నేటి సాక్షి, నారాయణపేట, రిపోర్టర్ ఇమామ్ సాబ్:** నారాయణపేట నియోజకవర్గం లోని మరికల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(బాలుర) లో శనివారం నాడు 11 గంటలకు క్రీడా పోటీలను ప్రారంభిస్తున్నట్లు మరికల్ మండల ఎంపీడీవో పృథ్వీరాజ్ తెలిపారు. ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ వివిధ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలుర,బాలికల పాఠశాలలకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ క్రీడ పోటీలను నారాయణపేట నియోజకవర్గంలోని అన్ని పాఠశాలల క్రీడాకారులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## రైతుల ఆందోళన

**యాప్ రద్దు చేయాలని డిమాండ్**

**చిలుకూరులో ఉద్రిక్తత**



**నేటి సాక్షి, చిలుకూరు:** కోదాడ నియోజకవర్గంలోని చిలుకూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద యూరియా ఎరువు అందుబాటులో లేకపోవడంతో రైతులు ఆందోళనకు దిగారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూరియా యాప్ కారణంగా చిన్న రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు ఆరోపించారు. ఈ సందర్భంగా కొందరు రైతులు సొసైటీకి తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. పురుగుమందు డబ్బాతో ఒక రైతు ధర్నా చేయడంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. యాప్ ద్వారా యూరియా ఆన్లైన్ చేసుకునేందుకు పెద్ద టచ్ మొబైల్ ఫోన్లు అవసరమవుతున్నాయని, సాధారణ ఫోన్లు ఉన్న రైతులు ఎరువులు పొందడంలో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. యాప్ విధానాన్ని రద్దు చేసి అందరికీ సమానంగా యూరియా అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు.

## ఉచిత మజ్జిగ, మంచినీరు పంపిణీ



**నేటి సాక్షి, చిలుకూరు:** సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం జెర్రిపోతులగూడెం గ్రామంలో నిర్వహించిన కనకదుర్గమ్మ జాతర సందర్భంగా ఎంఎంఎఫ్ "మేము సైతం" ఆధ్వర్యంలో భక్తులకు ఉచితంగా మజ్జిగ, మంచినీరు పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని చిలుకూరు ఎస్ఐ హనుమాన్ నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తులకు చల్లటి మజ్జిగ, మంచినీరు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. పోలీస్ శాఖ నుంచి ఎల్లప్పుడూ సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎంఎఫ్ చైర్మన్ షేక్ మధున బేగం, "మేము సైతం" అధ్యక్షులు విలాసకవి నిర్మల, పోలీస్ సిబ్బంది, కార్యవర్గ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## పాఠశాల విద్యార్థులకు రక్త పరీక్షలు



**నేటి సాక్షి - రాయికల్ ( ఇమ్మడి విజయ్ కుమార్ ) :** సులోచన హాస్పిటల్ జగిత్యాల వారి ఆధ్వర్యంలో డాక్టర్ శ్రీ ఆకుతోట శ్రీనివాస్ రెడ్డి సూచన మేరకు శుక్రవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భూపతిపూర్ లో 6వ తరగతి నుండి 10వ తరగతి చదువుతున్న విద్యార్థినులు 105 మందికి రక్తహీనతకు సంబంధించిన రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ భావన మహేందర్ గౌడ్ ప్రారంబించారు.ఇట్టి పరీక్షలను ఆసుపత్రి సిబ్బంది మిట్టపల్లి, గణేష్, చెవులమద్ది గౌరీ, పడకంటి ప్రకాష్ మరియు నల్ల గణేష్ పరీక్షలు చేశారు.ఈ కార్యక్రమములోఇంచార్జి ప్రధానోపాధ్యాయులు బొల్లె చిన్నయ్య, ఉపాధ్యాయులు సత్యనారాయణ, సహబజ్ హుస్సేన్, సంజయ్ కుమార్, ఖమరుద్దీన్, వేణుగోపాల్, సురేష్, పుష్పలత, భవాని, శైలజ మరియు వంశీధర్ రావు,సాయబు పాల్గొన్నారు.

# కొమ్ములవంచ పంచాయతీలో నిధుల స్వాహా



**నరసింహులపేట (మహబూబాబాద్ జిల్లా):** మండలంలోని కొమ్ములవంచ గ్రామపంచాయతీలో ప్రభుత్వ నిధులు పక్కదారి పట్టాయనే ఆరోపణలు మండలంలో తీవ్ర కలకలం రేపుతున్నాయి. చెరువుల వేలం ద్వారా వచ్చిన ఆదాయాన్ని గ్రామ ఖాతాలో జమ చేయకుండా, వ్యక్తిగత అవసరాలకు వాడుకున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 2023-24 మరియు 2024-25 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి గ్రామంలోని పాత, కొత్త చెరువులకు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. వేలంలో పాల్గొన్న పాటదారులు తమ సొమ్మును పూర్తిగా చెల్లించారు. అయితే, ఆ మొత్తాన్ని అధికారికంగా పంచాయతీ ఖాతాలో (ఋూ) జమ చేయాల్సి ఉండగా,

**● 'చేతి రసీదుల' వెనుక గుట్టు ఏమిటి?**

పంచాయతీ కార్యదర్శి మరియు మాజీ సర్పంచి ఆ పని చేయలేదని తెలుస్తోంది. అధికారిక రసీదులకు బదులుగా, కేవలం చేతి రసీదులు ఇచ్చి డబ్బులు వసూలు చేశారని, ఆ లెక్కలను రికార్డుల్లో చూపకుండా సొమ్మును స్వాహా చేశారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే డబ్బులు చెల్లించిన పాటదారులకు ఎంపీడీవో కార్యాలయం నుంచి నోటీసులు రావడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. తాము డబ్బులు కట్టామని, తమ వద్ద ఉన్న రసీదులే దానికి నిదర్శనమని పాటదారులు అధికారుల ముందు వాపోయారు. డబ్బులు కట్టినా మళ్లీ నోటీసులు రావడంతో తమ పరువు పోయిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా చేతి రసీదులు ఇవ్వడం వెనుక ఆంతర్యం ఏమిటి? పంచాయతీకి రావాల్సిన ఆదాయాన్ని వ్యక్తిగత అవసరాలకు వాడటం చట్టరీత్యా నేరం కాదా? మండలంలోని ఇతర గ్రామాల్లో కూడా ఇలాంటి అవకతవకలు జరుగుతున్నాయా? ఈ నిధుల దుర్వినియోగంపై ఉన్నతాధికారులు లోతైన విచారణ జరిపి, ప్రభుత్వ సొమ్మును కాజేసిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కొమ్ములవంచ గ్రామస్థులు కోరుతున్నారు.

# జీవన్ రెడ్డి 'స్వతంత్ర' పోరాటం!

- జగిత్యాలలో విచిత్ర రాజకీయాలు
- డాక్టర్ సంజయ్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేనంట.. కాంగ్రెస్‌కు ప్రచారం!
- జీవన్‌రెడ్డి కాంగ్రెస్ మాజీ మంత్రంట.. స్వతంత్రులకు ప్రచారం
- అయోమయంలో జగిత్యాల ఓటర్లు
- పుసుక్కున రెండోడితో కొట్లాడితే మూడోడు లాభపడితే?



**నేటి సాక్షి, జగిత్యాల బ్యూరో (రాధారపు నర్సయ్య):** జగిత్యాల మున్సిపల్ ఎన్నికలు రాజకీయంగా హైవోల్టేజ్ డ్రామాగా మారాయి. కాంగ్రెస్‌లోని అంతర్గత విభేదాలు తీవ్రమవుతున్న నేపథ్యంలో మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి స్వతంత్ర అభ్యర్థులకు బహిరంగ మద్దతు ప్రకటిస్తూ ఇంటింటా ప్రచారం చేస్తున్నారు. అదే సమయంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేస్తున్నారు. టికెట్ల కేటాయింపుపై అసంతృప్తితో జీవన్ రెడ్డి భావోద్వేగ వ్యాఖ్యలు చేస్తూ, రేవంత్ రెడ్డిపై కీలక ఆరోపణలు చేశారు.జగిత్యాలలో జీవన్ రెడ్డి చేస్తున్న 'స్వతంత్ర' పోరాటం వల్ల ఓటర్లు గందరగోళానికి గురవుతున్నారు.!



### మాజీ మంత్రి జీవన్ రెడ్డి భావోద్వేగ వ్యాఖ్యలు

జగిత్యాలలో ప్రచారంలో మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు పార్టీ మారిన ఎమ్మెల్యేలను రాళ్లతో కొట్టమని చెప్పారని, కానీ తాను ఓట్లతో కొడదామని చెబుతున్నానని అన్నారు. తన గొంతు కోద్దామని చూస్తున్నారని, గొంతు కోయాలంటే ముందు భుజాల్లాంటి తన కార్యకర్తలను దాటి రావాలని ఘాటుగా స్పందించారు. జీవితం అయిపోయే ముందు తనకు దుఃఖం తెప్పించారని భావోద్వేగంతో చెప్పారు.

### కాంగ్రెస్‌లో అన్యాయం జరుగుతోంది.!

"కాంగ్రెస్‌లో దొంగలు పడ్డారు, మా గుర్తును ఎత్తుకెళ్లారు" అని జీవన్ రెడ్డి ఆరోపించారు. దశాబ్దాలుగా కాంగ్రెస్ జెండా మోసిన, కష్టసమయంలో బీఆర్ఎస్ ప్రభుత్వంపై పోరాడిన అసలైన కార్యకర్తలకు టికెట్లు ఇవ్వకుండా వలసవాదులకు, కొత్త వచ్చిన వారికి బిఫాంలు ఇచ్చారని విమర్శించారు. "జీవితంలో ఎప్పుడూ కాంగ్రెస్‌కు ఓటు వేయని వారికి టికెట్లు ఇస్తే... పోరాటం చేయాలా వద్దా?" అని ప్రశ్నించారు. "నమ్ముకున్న వాళ్లకు అన్యాయం జరుగుతుంటే వారికి అండగా నిలవకూడదా? రాహుల్ గాంధీ ఆలోచనకు అనుగుణంగా నడుస్తున్నా" అని చెప్పారు.

### స్వతంత్ర అభ్యర్థులకు బలమైన మద్దతు

టికెట్లు రాకపోవడంతో అసంతృప్తి చెందిన జీవన్ రెడ్డి తన వర్గీయులు స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో నిలిచిన వారికి బహిరంగంగా మద్దతు ప్రకటించారు.జీవన్ రెడ్డి 24వ, 25వ వార్డుల్లో మానపురి పవిత్ర మహేష్, సామల జమున రాజశేఖర్, పులి రాము; 6వ, 27వ, 43వ వార్డుల్లో బింగి సుమ రవి, పల్లికొండ రాజు; 4వ వార్డులో ఎయిర్ కండిషనర్ గుర్తు, 23వ వార్డులో ఆపిల్ గుర్తు అభ్యర్థులకు మద్దతుగా ఇంటింటా, దుకాణాలు, హోటల్స్, మహిళల మధ్య ప్రచారం చేశారు.మార్కండేయ ఆలయంలో పూజలు చేసి, స్వాతంత్ర్య సమరయోధుడు కొండ లక్ష్మణ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వందలాది మందితో ప్లకార్డులు పట్టుకొని ర్యాలీలు నిర్వహించారు. "కష్టాల్లో అండగా నిలిచే బింగి సుమ రవి, పల్లికొండ రాజు, చీటి లక్ష్మీనారాయణలను గెలిపించండి" అని పిలుపునిచ్చారు. పులి రాము 20సంవత్సరాలుగా కాంగ్రెస్‌ను నమ్ముకున్నా, తనకు దగ్గరగా ఉన్నందుకే టికెట్ ఇవ్వలేదని అన్యాయం జరిగిందని వివరించారు.

### ఎమ్మెల్యే సంజయ్ వైపు మలుపు

బీఆర్ఎస్‌లోనే ఉన్నానని చెప్పుకునే ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ శుక్రవారం కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతుగా ఇంటింటా ప్రచారం చేశారు. చేతిగుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను కోరారు. జగిత్యాల అభివృద్ధి కోసం ప్రభుత్వంతో కలిసి పని చేస్తున్నానని, ప్రభుత్వాన్ని బలపరిచే కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని చెప్పారు.

### రాజకీయ గందరగోళం-ఓటర్ల అయోమయం

జగిత్యాల రాజకీయాలు విచిత్రంగా మారాయి. ఎవరు ఏ పార్టీ అనేది తెలియని పరిస్థితి నెలకొంది. కాంగ్రెస్ టికెట్లు ఎత్తుకెళ్లారని, వలసవాదులకు టికెట్లు ఇచ్చారని జీవన్ రెడ్డి ఆరోపించారు. అభివృద్ధి అంటే పక్కింటికి కన్నం వేయడమా.? అని ప్రశ్నించారు. పార్టీలు మారితే అభివృద్ధి జరుగుతుందా అని, రాజ్యాంగం ఇచ్చిన పౌర హక్కుల ఆధారంగా బోర్నపల్లి వంతెన కోసం 70 కోట్లు మంజూరు చేయించానని గుర్తుచేశారు. కెసిఆర్ నిధులు మంజూరు చేసినా బీఆర్ఎస్‌లో చేరలేదని, 2014లో టీఆర్ఎస్ అరాచకాలను ఎదిరించానని చెప్పారు. యావర్ రోడ్డు విస్తరణకు కృషి చేశానని తెలిపారు. ఓటర్లు గందరగోళానికి గురవుతున్నారు, ఎవరికి ఓటు వేయాలో అర్థం కాకుండా ఉంది.

### ప్రజల భరోసా

జీవన్‌రెడ్డి ప్రచారంతో అభ్యర్థుల్లో ఉత్సాహం పొంగిపోయింది. ఓటర్లు బాధపడకండి, మిమ్మల్ని గెలిపిస్తామని భరోసా ఇచ్చారు. చేతిలో చేయి వేసి మద్దతు తెలిపారు. జీవన్ అన్న ప్రజల పక్షాన నిలబడి పోరాడే నాయకుడని, నమ్ముకున్న కార్యకర్తల కోసం పోరాటం ఆగదని అన్నారు.







# బూరగపల్లిలో గంగ జాతర





**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి :** మండలంలోని ఆమీని గుంట పంచాయతీ బూరగపల్లిలో గంగ జాతరను ఘనంగా నిర్వహించారు. రెండు రోజులపాటు నిర్వహించే ఈ జాతరలో తొలి రోజున పశువులను అందంగా అలంకరించి పండగ చేస్తారు .అనంతరం గంగ జాతరను సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు ఊరంతా చలువ పందిళ్లు వేసి గ్రామ దేవతలను ఆరాధించారు .ముఖ్యంగా మహిళలు ఇంటి నుంచి పిండి దీపాలు తెచ్చి గ్రామ నడిబొడ్డున ఉన్న గంగమ్మకు పొంగళ్ళు పెట్టి విశేష పూజలు నిర్వహించారు ,ఈ సందర్భంగా గ్రామంలో నలుదిక్కులో ఉన్న గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేసారు

# గూడూరులో భీమా చెక్కు అందజేత



**నేటి సాక్షి, కమలాపూర్:** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం గూడూరు గ్రామానికి చెందిన ఉప్పుల జమున అనారోగ్యంతో ఇటీవల మృతిచెందారు. మృతురాలు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కమలాపూర్ శాఖలో ప్రధానమంత్రి జీవన్ జ్యోతి భీమా యోజన (PMJJB)లో భీమా తీసుకుని ఉండడంతో, ఆమె కుటుంబానికి భీమా ప్రయోజనం అందజేశారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కమలాపూర్ శాఖ మేనేజర్ సోమ్లా నాయక్ ఆధ్వర్యంలో, అసిస్టెంట్ మేనేజర్ మహారాజ్ మరియు బ్యాంక్ మిత్ర సెంటర్ సభ్యుడు తౌటం కరుణాకర్ సమక్షంలో రూ.2 లక్షల భీమా చెక్కును మృతురాలి కుమారుడు ఉప్పుల రాజేష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ మాట్లాడుతూ, యూనియన్ బ్యాంక్ కమలాపూర్ శాఖతో పాటు ఇతర బ్యాంక్ మిత్ర కేంద్రాల్లో కూడా ప్రతి ఒక్కరూ భీమా పథకాలకు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ భీమా పథకాలు ప్రతి కుటుంబానికి అవసరమైన సమయంలో ఎంతో ఉపయోగపడతాయని మండల ప్రజలకు తెలిపారు.

# ముగిసిన కుంకుమార్చన

## లక్ష కుంకుమార్చనకు విశేష స్పందన



**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి :** శక్తి క్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయంలో మూడు రోజులపాటు జరుగుతున్న లక్ష కుంకుమార్చన శుక్రవారంతో ముగిసింది శుక్రవారం అధిక సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. మూడు రోజులకు గాను దాదా 562 మంది దంపతులు కుంకుమార్చన లో పాల్గొన్నట్లు ఈవో ఉప కమిషనర్ ఏకాంబరం .తెలియజేశారు కుంకుమార్చన లో పాల్గొన్న దంపతులకు వివిధ రకాల వస్తువులు అందిస్తున్నట్లు ఆయన వివరించారు అమ్మవారి సేవలో పాల్గొని కరుణకు పాత్రులు అయ్యారని ఆయన ఈ సందర్భంగా అన్నారు లక్ష కుంకుమార్చన మూడురోజుల కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు ఆయన ఆలయ అధికార సిబ్బంది. భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు,

# కనకదుర్గమ్మ జాతర ముగింపు



**నేటి సాక్షి, చిలుకూరు :** చిలుకూరు మండలంలోని జెర్రిపోతులగూడెం గ్రామంలో కనకదుర్గమ్మ జాతర శుక్రవారం ఘనంగా ముగిసింది. జాతర సందర్భంగా కాంగ్రెస్, సిపిఐ, బీఆర్ఎస్, బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించగా, సిపిఐ ఆధ్వర్యంలో కోలాట ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ జాతరలు సాంప్రదాయ కళలకు నిదర్శనమని, మారుతున్న కాలంలో సంస్కృతి పరిరక్షణకు ఇటువంటి కార్యక్రమాలు అవసరమని తెలిపారు. జాతరలో జెర్రిపోతులగూడెం గ్రామంతో పాటు పరిసర గ్రామాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి కనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. జాతర సందర్భంగా గ్రామంలో బంధువులతో ఇళ్లు కళకళలాడగా, ప్రభలను అలంకరించి ఆలయం వద్ద ప్రదక్షిణలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చిలుకూరు ఎస్ఐ హనుమ నాయక్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

# ఆలయంలో దొంగతనం కేసులో 'భార్యాభర్తల అరెస్టు'.

- కోదండ రామాలయంలో దొంగతనం కేసు ఛేదన.
- బంగారు-వెండి ఆభరణాలు, నగదు స్వాధీనం
- ఇటువంటి నేరాలపై కఠిన చర్యలు తప్పవు డీఎస్పీ రఘు చందర్



**నేటి సాక్షి - జగిత్యాల బ్యూరో( రాధారపు నర్సయ్య ):** జగిత్యాల పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని ధరూర్ క్యాంప్‌లో ఉన్న కోదండ రామాలయంలో జరిగిన దొంగతనం కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో పాల్గొన్న భార్యాభర్తలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ రఘు చందర్ తెలిపారు.

### ఆలయంలో అర్ధరాత్రి దొంగతనం

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఈనెల 3వ తేదీ అర్ధరాత్రి కోదండ రామాలయంలో తాళాలు పగలగొట్టి లోనికి చొరబడ్డ దుండగులు, దేవుడికి సంబంధించిన బంగారు, వెండి ఆభరణాలతో పాటు హుండీలోని నగదును దొంగిలించారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి రావడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### భార్యాభర్తల అరెస్టు

దర్యాప్తులో భాగంగా జగిత్యాల రూరల్ మండలం తాటిపెల్లి గ్రామానికి చెందిన వడ్లూరి నాగరాజు, వడ్లూరి రజితలే ఈ దొంగతనానికి పాల్పడ్డట్లు పోలీసులు గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించడంతో ఇద్దరినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

### నిందితుల వద్ద నుండి స్వాధీనం

నిందితుల వద్ద నుండి రూ.4,357 నగదుతో పాటు దేవుడికి సంబంధించిన బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ రఘు చందర్ వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న వస్తువులను కేసు దర్యాప్తులో భాగంగా నమోదు చేసినట్లు తెలిపారు.

### ప్రజల భద్రతకే ప్రాధాన్యం

ప్రజల ఆస్తుల భద్రతకు జిల్లా పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని డీఎస్పీ స్పష్టం చేశారు. ఇటువంటి నేరాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు లేదా ఘటనలను గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా 100 నెంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

# మహిళా సమాఖ్య భవనాల నిర్మాణానికి భూమి పూజ

**నేటి సాక్షి - రాయికల్ ( ఇమ్మడి విజయ్ కుమార్ ) :** రాయికల్ మండల ఆలూరు,రాజ్ నగర్ గ్రామాల్లో మహిళా సమాఖ్య భవనాల నిర్మాణానికి 10 లక్షల చొప్పున మంజూరు కాగా శుక్రవారం జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా జగిత్యాల వారు మాట్లాడుతూ. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా అన్ని రంగాల్లో ముందుండాలని ఆకాంక్షించారు. గ్రామాల సమగ్ర అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని, విద్యారంగం, వైద్య రంగం మహిళా సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుంది అని అన్నారు.అధికార పార్టీ అండతో అభివృద్ధి సాధ్యం అవుతుంది అన్నారు. గ్రామలలో ప్రభుత్వ భూములు అందుబాటులో ఉండటంతో మహిళా సంఘాల శాశ్వత భవనాల నిర్మాణం చేపట్టాలని మహిళా స్వయం సహాయక సంఘ సభ్యులు ప్రభుత్వానికి ఎంతో కాలంగా విజ్ఞప్తి చేస్తున్న నేపథ్యంలో ప్రజా ప్రభుత్వం ఈనిర్ణయం తీసుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.మహిళలకు గౌరవం, భద్రత, ఆత్మవిశ్వాసం కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు నల్లాల స్వామి,భారతపు రాజేష్,ఉప సర్పంచ్‌లు సల్ల



మహేష్,శ్రీనివాస్,మండల నాయకులు రవీందర్ రెడ్డి,కోల శ్రీనివాస్,మోర హనుమండ్లు, గన్నెరాజిరెడ్డి భాస్కర్ రావు సురేందర్ రెడ్డి రామ్ రెడ్డి ఆయా గ్రామ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల సిబ్బంది రాండమైజేషన్ పూర్తి



- ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి కలెక్టర్ కుమార్ దీపక్

**నేటి సాక్షి మంచిర్యాల:** జిల్లాలో జరగనున్న 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి సిబ్బంది రాండమైజేషన్ ప్రక్రియ విజయవంతంగా పూర్తయిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శుక్రవారం నస్పూర్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు కె.గంగాధర్, జిల్లా విద్యాధికారి యాదయ్యలతో కలిసి ఆయన ఈ ప్రక్రియను పర్యవేక్షించారు. ఒక బృందానికి ఒక పి.ఓ. (PO), ఒక ఎ.పి.ఓ. (APO), ముగ్గురు ఓ.పి.ఓ. (OPO)ల చొప్పున రాండమైజేషన్ ద్వారా సిబ్బందిని కేటాయించారు, మంచిర్యాల నగరపాలక సంస్థ: 265 బృందాలు, బెల్లంపల్లి మున్సిపాలిటీ: 68 బృందాలు, క్యాతనపల్లి మున్సిపాలిటీ: 45 బృందాలు, చెన్నూరు మున్సిపాలిటీ: 36 బృందాలు, లక్షెట్టిపేట మున్సిపాలిటీ: 30 బృందాలు

### పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్లు:

ఎన్నికల విధులు కేటాయించబడిన సర్వీస్ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది ఫిబ్రవరి 8 మరియు 9 తేదీలలో. ఉదయం 9:00 నుండి సాయంత్రం 5:30 గంటల వరకు. బెల్లంపల్లి, చెన్నూర్, లక్షెట్టిపేట, క్యాతనపల్లి మున్సిపల్ కార్యాలయాల్లో మరియు మంచిర్యాల నగరపాలక సంస్థకు సంబంధించి నస్పూర్ కలెక్టరేట్ లో ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేశారు.ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఫారం-12 మరియు ఎపిక్ (EPIC) కార్డు తప్పనిసరిగా తీసుకువెళ్లాలి. పంపిణీ, స్వీకరణ మరియు ఓట్ల లెక్కింపు ఎన్నికల సామాగ్రి పంపిణీ, స్వీకరణ మరియు ఓట్ల లెక్కింపు కోసం కేటాయించిన ఐజా ఇంజనీరింగ్ కళాశాల, ముల్కల్ల. బజార్ ఏరియాలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల. అటవీశాఖ కార్యాలయం వెనుక గల ప్రభుత్వ ఉన్నత పాఠశాల.సూపర్ బజార్ ఏరియాలోని ఆర్.కె.సి.ఓ.ఎ. (RKCOA) క్లబ్. పాత ఎంపీడీవో కార్యాలయం. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్, ఎన్నికల సిబ్బంది మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# అడవి పందుల వలన నష్టపోయిన రైతులకు చెక్కులను పంపిణీ

- ఫారెస్ట్ రేంజ్ అధికారిణి ప్రణీత భాయి..

**నేటి సాక్షి కొత్తపల్లె :** కొత్తపల్లి మండలంలోని, గ్రామాల్లో ఉన్న రైతుల మొక్కజొన్న పంటలపై అడవి పందుల దాడిలో నష్టపోయిన మొక్కజొన్న రైతులకు ఫారెస్ట్ రేంజ్ అధికారిణి ప్రణీత భాయి నష్టపరిహారం చెక్ లను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ రేంజ్ అధికారిణి ప్రణీతాబాయి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రైతులు తమ వ్యవసాయ పొలాల్లో మొక్కజొన్న పంటలు సాగు చేసుకుంటున్న తరుణంలో అడవి పందుల బెడద నుంచి నష్టపోయిన మొక్కజొన్న రైతులకు ఫారెస్ట్ అధికారుల ఆధ్వర్యంలో చెక్ లను అందజేయడం జరిగిందన్నారు. కొత్తపల్లి మండలంలోని, పెద్ద గుమ్మడాపురం, చిన్న గుమ్మడాపురం రైతులకు 54 మందికి పరిహారం చెక్ లు మంజూరు అయ్యాయన్నారు. ఫారెస్ట్ అధికారుల ఆధ్వర్యంలో ఒక ఎకరా కు 10 వేల వరకు నష్టపరిహారం అందజేయడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగానే క్షేత్రస్థాయిలో రైతు పంట ఎంత





మేరకు నష్టం జరిగింది పరిశీలించి నష్టాన్ని అంచనా వేసిన తర్వాతే పరిహారం మంజూరు చేయడం జరిగిందన్నారు. అలాగే నల్లమల్ల అడవులకు సమీపంలో ఉన్న రైతులందరూ తమ పంట పొలాలు వేసిన సమయంలో అడవి జంతువులకు ఎలాంటి హాని కలిగించరాదన్నారు. పంటలను నాశనం చేయకుండా అడవి జంతువులను శబ్దాలతో బెదిరించాలి తప్ప హాని చేస్తే చట్ట పరమైన చర్యలు ఉంటాయని రైతులకు సూచించారు. ఈ చెక్ ల పంపిణీ కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ మద్దిలేటి, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ లు సలాముల్ల, పాములేటి, రైతులు ఉన్నారు.

# అండర్-19 వరల్డ్‌కప్‌లో భారత్ డామినెన్స్

**వరల్డ్‌కప్‌లలో భారత్ ఆడిన మ్యాచ్‌లు 38**

**కేవలం 3 మ్యాచ్‌లలో మాత్రమే ఓటమి**

## 92 శాతం విజయాలు..

**2016 నుంచి అండర్-19 వరల్డ్‌కప్‌లలో భారత యువ జట్టు చూపిస్తున్న ప్రదర్శన ప్రపంచ క్రికెట్‌ను ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఈ కాలంలో భారత్ ఆడిన మ్యాచ్‌ల సంఖ్య, సాధించిన విజయాలు చూస్తే.. యువ క్రికెట్‌లో టీమిండియా ఎంత బలంగా ఉందో ఇట్టే అర్థమవుతుంది. నిలకడ, లోతైన బ్యాటింగ్ లైనప్, క్రమశిక్షణతో కూడిన బౌలింగ్ దళం భారత్‌ను ఇతర జట్ల కంటే ముందుకు తీసుకెళ్తోంది.**



2016 నుంచి ఇప్పటివరకు జరిగిన అండర్-19 వరల్డ్‌కప్‌లలో భారత్ మొత్తం 38 మ్యాచ్‌లు ఆడింది. అందులో ఏకంగా 35 మ్యాచ్‌లలో విజయం సాధించి.. అద్భుత రికార్డు నెలకొల్పింది. కేవలం 3 మ్యాచ్‌లలో మాత్రమే ఓటమిని చవిచూసింది. ఆ మూడు పరాజయాలు కూడా లీగ్ లేదా నాకౌట్ దశల్లో కాకుండా.. నేరుగా ఫైనల్ మ్యాచ్‌ల్లో ఉండడం గమనార్హం. 2016, 2020, 2024 అండర్-19 వరల్డ్‌కప్ ఫైనల్స్‌లో భారత్ ఓటమిని ఎదుర్కొంది. అయినప్పటికీ ఫైనల్ వరకు చేరుకోవడం, వరుసగా టైటిల్ పోరులో నిలవడం భారత యువ క్రికెట్ బలాన్ని స్పష్టంగా చూపిస్తోంది.

అండర్-19 వరల్డ్‌కప్‌లలో భారత్ విజయం శాతం 92.1 శాతంగా ఉంది. వరల్డ్‌కప్ చరిత్రలో ఇది గొప్ప రికార్డుల్లో ఒకటి. మొత్తంగా చూస్తే.. 2016 నుంచి అండర్-19 వరల్డ్‌కప్‌లలో భారత్ యువ జట్టు ఆధిపత్యం అసాధారణం అనే చెప్పాలి. వరల్డ్‌కప్‌లలో ప్రతిసారి ఫైనల్స్ చేరడం, అధిక విజయ శాతం నమోదు చేయడం భారత క్రికెట్ వ్యవస్థ పటిష్టతకు నిదర్శనం. ఈ యువ ఆటగాళ్లే రానున్న రోజుల్లో సీనియర్ టీమిండియాకు వెన్నెముకగా మారతారనే నమ్మకం క్రికెట్ అభిమానుల్లో బలంగా ఉంది.

# వరల్డ్ క్రికెట్‌లో భారత్ సువర్ణాధ్యాయం





## రెండేళ్లలో ఐదు ఐసీసీ ట్రోఫీలు!

### ఐసీసీ ట్రోఫీలపై భారత్ సంపూర్ణ ఆధిపత్యం

**భారత క్రికెట్ మరోసారి ప్రపంచానికి తన శక్తిని చాటింది. సీనియర్ నుంచి అండర్-19 వరకూ.. పురుషులు, మహిళలు అన్ని విభాగాల్లో టీమిండియా అద్భుత విజయాలు సాధిస్తూ ఐసీసీ ట్రోఫీలపై సంపూర్ణ ఆధిపత్యాన్ని నెలకొల్పింది. ప్రస్తుతం భారత్ ఒకేసారి ఐదు ప్రధాన ఐసీసీ టైటిల్స్‌ను తన ఖాతాలో వేసుకుని ప్రపంచ క్రికెట్‌లో అరుదైన ఘనత సాధించింది.**

పురుషుల విభాగంలో భారత్ 2024లో జరిగిన టీ20 వరల్డ్‌కప్‌ను గెలుచుకుని పొట్టి ఫార్మాట్‌లో తన సత్తాను నిరూపించింది. ఆ తర్వాత 2025 ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీని కూడా సొంతం చేసుకుని. వన్డే క్రికెట్‌లోనూ తన ఆధిపత్యాన్ని కొనసాగించింది. ఈ రెండు విజయాలు భారత సీనియర్ జట్టు స్థిరత్వం, లోతైన బెంచ్ స్ట్రెంత్‌కు నిదర్శనంగా నిలిచాయి.

మహిళల క్రికెట్‌లోనూ భారత్ సరికొత్త చరిత్ర సృష్టించింది. 2025 మహిళల వన్డే వరల్డ్‌కప్‌ను గెలుచుకుని తొలిసారి ఈ ప్రతిష్టాత్మక ట్రోఫీని భారత మహిళల జట్టు అందుకుంది. అంతేకాదు, అదే ఏడాది జరిగిన మహిళల అండర్-19 వరల్డ్‌కప్‌లోనూ భారత్ విజేతగా నిలిచి యువ ప్రతిభలోనూ తన ఆధిపత్యాన్ని చాటింది.

యువ క్రికెట్‌లో భారత జట్టు ప్రభావం మరింత స్పష్టంగా కనిపిస్తోంది. 2026లో జరిగిన పురుషుల అండర్-19 వరల్డ్‌కప్‌ను గెలుచుకుని భారత్ మరోసారి భవిష్యత్ క్రికెట్ తనదేనని నిరూపించింది. వరుసగా వస్తున్న యువ ఆటగాళ్లు అంతర్జాతీయ స్థాయికి సిద్ధంగా ఉండటం భారత క్రికెట్ వ్యవస్థ బలాన్ని చూపిస్తోంది.

ప్రస్తుతం భారత్ ఒకేసారి పురుషుల టీ20 వరల్డ్‌కప్ (2024), ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ (2025), మహిళల వన్డే వరల్డ్‌కప్ (2025), మహిళల అండర్-19 వరల్డ్‌కప్ (2025), పురుషుల అండర్-19 వరల్డ్‌కప్ (2026) టైటిల్స్‌ను కలిగి ఉంది. ఇది ప్రపంచ క్రికెట్ చరిత్రలోనే అరుదైన ఘనతగా నిలుస్తోంది. అన్ని స్థాయిల్లోనూ విజయాలు సాధిస్తూ.. భారత క్రికెట్ నిజంగా స్వర్ణయుగంలోకి అడుగుపెట్టిందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.

# వైభవ్ సూర్యవంశీని బ్యాన్ చేయాలి

## ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ సంచలన వ్యాఖ్యలు

### వరల్డ్‌కప్ ఫైనల్‌లో అత్యంత వేగవంతమైన సెంచరీ

### 80 బంతుల్లో 15 సిక్సులు, 15 ఫోర్లతో 175 పరుగులు



అండర్-19 వరల్డ్‌కప్ ఫైనల్‌లో అత్యంత వేగవంతమైన సెంచరీ చేసిన భారత యువ సంచలనం, 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ పేరు ప్రపంచ క్రికెట్‌లో ఇప్పుడు సంచలనంగా మారింది. ఇంగ్లాండ్‌తో జరిగిన 2026 వరల్డ్‌కప్ ఫైనల్‌లో 55 బంతుల్లోనే సెంచరీ బాదాడు. మొత్తంగా 80 బంతుల్లో 15 సిక్సులు, 15 ఫోర్లతో 175 పరుగులు చేశాడు. వైభవ్ అద్భుత ప్రదర్శనను జీర్ణించుకోలేని ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్, ప్రముఖ కామెంటేటర్ నాసిర్ హుస్సేన్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. బీసీసీఐ ప్రభావాన్ని అరికట్టేందుకు సూర్యవంశీని క్రికెట్ నుంచే నిషేధించాలని డిమాండ్ చేశాడు. హుస్సేన్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది.

నాసిర్ హుస్సేన్ మాట్లాడుతూ 'ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే బీసీసీఐ ప్రపంచ క్రికెట్‌ను నాశనం చేస్తోంది. భవిష్యత్తులో క్రికెట్‌లో నిజమైన స్పిరిట్ ఉండకపోవచ్చు. క్రికెట్‌కు, రాజకీయాలకు ఎలాంటి సంబంధం ఉండకూడదు' అని వ్యాఖ్యానించాడు. గతంలో ఐసీసీపై బ్రిటన్ ప్రభావం ఉన్నప్పుడు దక్షిణాఫ్రికాను సుమారు 20 ఏళ్ల పాటు అంతర్జాతీయ క్రికెట్‌కు దూరం పెట్టారని, జింబాబ్వేకు ఇంగ్లాండ్‌లో జరిగిన టీ20 వరల్డ్‌కప్‌కు వీసాలు నిరాకరించారని గుర్తు చేశాడు. అవన్నీ మానవత్వం, ప్రపంచ సూత్రాల పేరుతో తీసుకున్న నిర్ణయాలేనని సమర్థించుకున్నాడు.

భారత్-పాకిస్తాన్ క్రికెట్ సంబంధాలపై కూడా నాసిర్ హుస్సేన్ తీవ్ర వ్యాఖ్యలు చేశాడు. 'ఉగ్రవాదం పేరుతో పాకిస్తాన్‌పై భారత్ రాజకీయాన్ని క్రికెట్‌లోకి తెస్తోంది. ఇది పూర్తిగా హాస్యాస్పదం. ఆటకు ఇది పూర్తి విరుద్ధం' అంటూ బీసీసీఐని విమర్శించాడు. ఇక వైభవ్ సూర్యవంశీ ప్రదర్శనపై అసహనం వ్యక్తం చేస్తూ 'ఇప్పుడు మా (ఇంగ్లాండ్) జట్టుపై 14 ఏళ్ల పిల్లాడు ఫైనల్‌లో వేగవంతమైన సెంచరీ చేశాడు. ఇది బీసీసీఐ ప్రభావాన్ని మరింత పెంచుతుంది. దీని వల్ల క్రికెట్ తప్పుదారి పడే ప్రమాదం ఉంది. బీసీసీఐ ప్రభావాన్ని అరికట్టేందుకు ఇతర దేశాలు ఈసీబీతో కలిసి రావాలి' అంటూ నాసిర్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. హుస్సేన్ వ్యాఖ్యలపై విమర్శలు వస్తున్న విషయం తెలిసిందే. టీమిండియాపై హుస్సేన్ అక్కసు వెళ్లగక్కడం ఇదేం కొత్త కాదు కానీ.. బీసీసీఐపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేయడం హాట్ టాపిక్‌గా మారింది.




# ఆస్ట్రేలియాకు బిగ్ షాక్..

## వరల్డ్ కప్‌కి స్టార్ బౌలర్ దూరం

### నేటి నుంచి ప్రారంభం కానున్న టీ20 వరల్డ్ కప్..

### గాయంతో మెగా టోర్నీకి దూరమైన జోష్ హేజిల్‌వుడ్..

నేటి నుంచి ప్రారంభమయ్యే టీ20 వరల్డ్ కప్ కు ముందు ఆస్ట్రేలియా జట్టుకు బిగ్ షాక్ తగిలింది. కీలక ప్లేయర్ జోష్ హేజిల్‌వుడ్ గాయం నుంచి పూర్తిగా కోలుకోకపోవడంతో ఈ మెగా టోర్నమెంట్ కు పూర్తిగా దూరమయ్యాడు. దీంతో జోష్ హేజిల్‌వుడ్ స్థానంలో ప్రస్తుతం ఎవరినీ భర్తీ చేయడం లేదని క్రికెట్ ఆస్ట్రేలియా ప్రకటన చేసింది. గాయం నుంచి కోలుకుని టోర్నమెంట్ మధ్యలో జట్టులో చేరతాడు అనే ఆశలు ఉన్నప్పటికీ, తాజా మెడికల్ రిపోర్ట్స్ ఆ అవకాశాన్ని నిరాకరించాయి.


కాగా, ఈ విషయంపై సెలక్టర్ టోనీ డోడెమైడ్ మాట్లాడుతూ.. సూపర్- 8 దశ నాటికి హేజిల్‌వుడ్ పూర్తి ఫిట్‌నెస్ సాధిస్తాడని మేం అనుకున్నాం.. కానీ తాజా పరిస్థితుల ప్రకారం అతడు కోలుకోవడానికి ఇంకా కొంత టైం పడుతుంది అన్నారు. అతడిని తొందరపెట్టి మైదానంలోకి దింపడం ప్రమాదకరం అని చెప్పారు. ప్రస్తుతం ఉన్న జట్టుతోనే ప్రారంభ మ్యాచ్‌లు ఆడగలం అనే నమ్మకం తమకు ఉందని పేర్కొన్నారు. అవసరం ఉంటే మాత్రమే రీప్లేస్‌మెంట్‌పై తుది నిర్ణయం తీసుకుంటామని టోనీ డోడెమైడ్ తేల్చి చెప్పారు. ఇక, ఆస్ట్రేలియా జట్టు ఫిబ్రవరి 11వ తేదీన ఐర్లాండ్‌తో తమ తొలి మ్యాచ్‌ను ఆడనుంది. ఈ టోర్నీలో ఆస్ట్రేలియా తమ మొదటి నాలుగు మ్యాచ్‌లను శ్రీలంకలోని పల్లెకెలె, కొలంబో వేదికలలో ఆడనుంది.

అయితే, టీ20 ప్రపంచకప్ 2026 నేటి నుంచి ప్రారంభం కానుంది. ఫిబ్రవరి 7వ తేదీన అట్టహాసంగా స్టార్ట్ కానున్న ఈ మెగా టోర్నమెంట్, మార్చి 8వ తేదీన జరిగే ఫైనల్‌తో ముగియనుంది. ఈసారి ప్రపంచకప్ టైటిల్ కోసం మొత్తం 20 జట్లు బరిలో ఉండగా, 55 మ్యాచ్‌లు జరగనున్నాయి.

# స్మృతి మంధానకు కోహ్లీ స్పెషల్ విషెస్



రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఛాంపియన్?గా నిలవడంతో స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ హర్షం వ్యక్తం చేశాడు. అద్భుతమైన విజయం సాధించిన ఆర్సీబీ మహిళల జట్టుకు, మేనేజ్?మెంట్?కు విరాట్? శుభాకాంక్షలు తెలిపాడు. కెప్టెన్ స్మృతి మంధాన, ఆర్సీబీ జట్టును చూసి గర్వపడాలని అన్నాడు. రెండోసారి ఛాంపియన్?గా నిలిచి ఆర్సీబీ పతాకాన్ని అత్యున్నత స్థానంలో ఎగురవేశారని అభినందించాడు. ఈ మేరకు సోషల్ మీడియా ఇన్?స్టాగ్రామ్?లో ఓ పోస్ట్ షేర్ చేశాడు. 'రెండోసారి ఛాంపియన్?గా నిలిచి ఆర్సీబీ పతాకాన్ని అత్యున్నత స్థానంలో ఎగురవేశారు. మిమ్మల్ని చూస్తుంటే గర్వంగా ఉంది. స్మృతి మంధాన, ఆర్సీబీ జట్టు, మేనేజ్?మెంట్?కు శుభాకాంక్షలు. ఈ విజయానికి మీరు నిజమైన అర్హులు. ఈ అద్భుతమై క్షణాలను ఆస్వాదించండి' అని విరాట్ కోహ్లీ ఆర్సీబీ ట్రోఫీ ఫొటోను షేర్ చేస్తూ రాసుకొచ్చాడు. మహిళల జట్టు నెగ్గడంతో విరాట్ పోస్టు పెట్టడంపై ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఐపీఎల్?లో తమ జట్టు కూడా ఇదే రిపీట్ చేయాలని ఆశిస్తున్నట్లు కామెంట్లు పెడుతున్నారు. ఈ ఫైనల్?లో ఆర్సీబీ కెప్టెన్ స్మృతి మంధాన (87 పరుగులు, 41 బంతుల్లో) సూపర్ ఇన్నింగ్స్?తో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. అయితే మంధాన జ్వరంతో బాధపడుతూనే ఈ మ్యాచ్?లో బరిలో దిగినట్లు ఆర్సీబీ కోచ్ మలోలన్ రంగరాజన్ తెలిపాడు. అనారోగ్యంగా ఉన్నప్పటికీ జట్టు కోసం బరిలో దిగడాన్ని ఆయన కొనియాడాడు. ఈ మేరకు మ్యాచ్ అనంతరం ప్రెస్?మీట్?లో రంగరాజన్ చెప్పాడు. 'ఫైనల్ మ్యాచ్?లో మంధాన అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడింది. అయితే ఈ మ్యాచ్?కు ముందు మంధాన తీవ్రమైన ఫ్లూతో బాధ పడుతోంది. చాలా అనారోగ్యంగా ఉంది. కానీ ఆ ప్రభావం మ్యాచ్ మీద పడలేదు. దీని గురించి నేను ఆమెతో మాట్లాడినప్పుడు, 'ప్రాబ్లమ్ ఏం లేదు, నేను ఆడతాను' అని చెప్పింది. గత ఏడాది కాలంగా ఆమె మంచి ఫామ్‌లో ఉంది. అయిత ఆమె ఈ రోజు ఆడిన ఇన్నింగ్స్‌ను వర్ణించడానికి మాత్రం నాకు మాటలు చాలడం లేదు. మంచి టైమింగ్?తో బ్యాటింగ్ చేసింది. వీలు చిక్కినప్పుడు ఎటాకింగ్ మోడ్?లోకీ మారింది. బ్యాటింగ్?లో ఆమె ఒక మేధావి. తన ఆటను, నైపుణ్యాన్ని మెరుగుపరుచుకునేందుకు ఎల్లప్పుడూ ప్రయత్నిస్తూనే ఉంటుంది' అని రంగరాజన్ పేర్కొన్నాడు. కాగా, గురువారం వడోదర వేదికగా ఢిల్లీ క్యాపిటల్స్?తో జరిగిన డబ్ల్యూపీఎల్ ఫైనల్?లో ఆర్సీబీ 6 వికెట్ల తేడాతో గ్రాండ్ విక్టరీ కొట్టింది. ఢిల్లీ నిర్దేశించిన 204 పరుగుల లక్ష్యాన్ని ఆర్సీబీ 4 వికెట్లు కోల్పోయి 19.4 ఓవర్లలో ఛేదించింది. స్మృతి మంధాన (87 పరుగులు), జార్జియా వోల్ (79 పరుగులు) హాఫ్ సెంచరీలతో రాణించారు. మంధానకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డ్ లభించింది.



## అర్జున్ కూతురు హీరోయిన్‌గా

# సీతాపయనం

### ఈనెల 14న గ్రాండ్‌గా విడుదలకు సన్నాహాలు

యాక్షన్ కింగ్ అర్జున్ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన విభిన్న కథా చిత్రం 'సీతా పయనం'. శ్రీ రామ్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై రూపొందిన ఈ సినిమా ద్వారా అర్జున్ కుమార్తె ఐశ్వర్య అర్జున్ వెండితెరకు కథానాయికగా పరిచయం అవుతుండటం విశేషం. నిరంజన్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో సత్యరాజ్, ప్రకాష్ రాజ్, కోవై సరళ వంటి దిగ్గజ నటులు కీలక పాత్రలు పోషించగా, అర్జున్ స్వయంగా ఒక ప్రత్యేక పాత్రలో మెరవనున్నారు. అలాగే ఆయన మేనల్లుడు, యాక్షన్ ప్రిన్స్ ధ్రువ సర్జా కూడా ఈ మూవీలో స్పెషల్ కామియో రోల్‌లో కనిపించబోతున్నారు. ఈ సినిమాను ప్రేమికుల రోజు కానుకగా ఫిబ్రవరి 14న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది. ప్రస్తుతం అన్ని రకాల పోస్ట్ ప్రొడక్షన్ పనులతో పాటు సెన్సార్ కార్యక్రమాలను కూడా పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఇప్పటికే పాజిటివ్ బజ్‌ను సొంతం చేసుకుంది. ప్రమోషన్స్‌లో భాగంగా ఇప్పటికే విడుదలైన పాటలు, ఇతర కంటెంట్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోవడంతో సినిమాపై అంచనాలు భారీగా పెరిగాయి. ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియన్స్‌కు నచ్చే హృద్యమైన అంశాలతో పాటు, అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేలా ఈ చిత్రాన్ని అర్జున్ అద్భుతంగా తీర్చిదిద్దారు. తెలుగుతో పాటు కన్నడ, తమిళం, మలయాళం మరియు హిందీ భాషల్లో ఈ సినిమాను పాన్ ఇండియా స్థాయిలో భారీగా విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. సాంకేతికంగా కూడా ఈ సినిమా అత్యున్నత ప్రమాణాలతో రూపొందింది. జి. బాలమురుగన్ సినిమాటోగ్రఫీ అందించగా, ప్రముఖ రచయిత సాయి మాధవ్ బుర్రా పదునైన డైలాగ్స్ రాశారు. యాక్షన్ కింగ్ సినిమా అంటేనే ÷ట్స్ స్పెషల్‌గా ఉంటాయి కాబట్టి, ఈ చిత్రంలోని స్టంట్ సన్నివేశాలకు కిక్ యాస్ కాళీ కొరియోగ్రఫీ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. వినూత్న ప్రచార కార్యక్రమాలతో ప్రేక్షకుల్లోకి వెళ్తున్న మేకర్స్, త్వరలోనే సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఫిబ్రవరి 14న ఐదు భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానున్న 'సీతా పయనం' బాక్సాఫీస్ వద్ద ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో వేచి చూడాలి.

# మైత్రీ మూవీ మేకర్స్‌తో నవీన్ పోలిశెట్టి చిత్రం



'అనగనగా ఒక రాజు' చిత్రంతో మొదటిసారి రూ.100 కోట్ల క్లబ్‌లో చోటు దక్కించుకున్నాడు టాలీవుడ్ యంగ్ అండ్ ఎనర్జిటిక్ స్టార్ నవీన్ పోలిశెట్టి. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ.100 కోట్ల గ్రాస్ వసూళ్లను సాధించి సరికొత్త రికార్డు సృష్టించింది. ఈ విజయంతో నవీన్ పోలిశెట్టి తన కెరీర్‌లో తొలి వంద కోట్ల మైలురాయిని అందుకున్న నటుడిగా నిలిచారు. అయితే ఈ అద్భుతమైన విజయంతో ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ స్పందిస్తూ నవీన్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపింది. ఈ సందర్భంగా తమ తదుపరి ప్రాజెక్ట్‌లో నవీన్ భాగమవుతుండడంతో ఈ సినిమా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు ప్రకటించింది. అయితే మైత్రీ బ్యానర్‌లో రాబోతున్న ఈ చిత్రం ఎలా ఉండబోతుందని ప్రేక్షకులకు ఎదురుచూస్తున్నారు.

# మాదక ద్రవ్యాల ప్రభావంతో అల్లుకున్న యుఫోరియా




ఎన్నో విజయవంతమైన చిత్రాలకు కేరాఫ్ అడ్రస్ గుణశేఖర్.. . కానీ, కొన్నేళ్లుగా ఆయన సినిమాలేవీ ఆశించిన స్థాయిలో అలరించలేకపోయాయి. ఈ నేపథ్యంలోనే ఈసారి విజయమే లక్ష్యంగా యువతరాన్ని దృష్టిలో పెట్టుకుని తీసిన చిత్రం 'యుఫోరియా' శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. చైత్ర (సారా అర్జున్) ఓ పెద్దింటి అమ్మాయి. చదువులో టాపర్. ఐఏఎస్ అవ్వాలన్నది తన లక్ష్యం. దాని కోసమే పట్టుదలగా పరీక్షలకు సిద్ధమవుతుంటుంది. ఓరోజు తన మిత్రురాలు ఓ పబ్ పార్టీకి పిలవడంతో అమ్మానాన్న అనుమతితో ఆ పార్టీకి వెళ్తుంది. అక్కడే వికాశ్ (విఘ్నేశ్ గవిరెడ్డి)తో పాటు అతని మిత్ర బృందం పరిచయమవుతుంది. చైత్ర అందచందాలు చూసి ఆకర్షితుడైన వికాశ్.. ఆమెపై కన్నేస్తాడు. తను తిరిగి వెళ్తున్న సమయంలో కారులో సరదాగా బయటకు వెళ్దామని ఆఫర్ చేస్తాడు. అయితే వికాశ్‌పై స్నేహభావంతో అతని కారెక్కిన చైత్రకు చేదు అనుభవం ఎదురవుతుంది. డ్రగ్స్ మత్తులో ఉన్న వికాశ్‌తో పాటు అతని మరో నలుగురు మిత్రులు ఆమెపై దారుణ రీతిలో అత్యాచారానికి పాల్పడతారు. మరి ఆ తర్వాత ఏమైంది? రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ రేప్ కేసును సిటీ కమిషనర్ జయదేవ్ (గౌతమ్ మేనన్) ఎలా ఛేదించారు? పేరు మోసిన రాజకీయ నేతలు, వ్యాపారవేత్తల పిల్లలు నిందితులుగా ఉన్న ఈ కేసును పరిష్కరించే క్రమంలో ఎదురైన సవాళ్లేంటి? ఈ కథ లో వింధ్య వేములపల్లి (భూమిక) పాత్రకి ఉన్న ప్రాధాన్యత ఏంటి? ఆమె 'నేను నేరం చేశాను.. శిక్ష విధించండి' అంటూ' హైకోర్టు మెట్లు ఎక్కడానికి వెనకున్న కారణమేంటి? కమిషనర్ జయదేవ్ ప్రారంభించిన 'ఆపరేషన్ యుఫోరియా' లక్ష్యం ఏంటి? అన్నది మిగిలిన కథ. యువతరం మాదకద్రవ్యాలకు అలవాటు పడితే ఏమవుతుంది.. ఆ మత్తులో విచక్షణ కోల్పోయి చేసే తప్పులకు పిల్లల జీవితాలతో పాటు కన్నవాళ్ల జీవితాలు ఎలా తలకిందుల య్యాయి? అనేది ఈ చిత్ర సారాంశం. రెండు తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన జూబ్లీహిల్స్ పబ్ అత్యాచార ఘటనతో పాటు మరికొన్ని కీలక సంఘటనల్ని స్ఫూర్తిగా తీసుకుని ఈ కథను అల్లుకున్నట్లు అర్థమవుతోంది. నిజానికి ఈ చిత్ర ట్రైలర్‌తోనే సినిమా కథేంటి? అదెలా సాగనుందన్నది ముందే క్లారిటీగా చెప్పేశారు దర్శకుడు గుణశేఖర్. కాకపోతే దీన్ని ఆయన తెరపై ఏ కోణంలో ఆవిష్కరించారు? దీనిపై ఎంత లోతుగా చర్చించారన్నది అందరిలోనూ ఆసక్తిరేకెత్తించింది. అత్యాచార ఘటనకు సంబంధించిన వార్తల్ని అన్నింటిని ఓ దగ్గర పోగేసి తీసిన సినిమా ఇది. దీంతో ఆసక్తికర డ్రామాగా సాగాల్సిన మూవీ ఒక డాక్యుమెంటరీలా అనిపిస్తుంది. చైత్ర అత్యాచార ఘటన కేసు ఇన్వెస్టిగేషన్ మొదలయ్యాకే కథలో కాస్త సంఘర్షణ కనిపిస్తుంది. ఈ కేసులోని నిందితులతో కమిషనర్ జయదేవ్ వ్యవహరించే తీరు ఆసక్తిరేకెత్తిస్తుంది. ఇలాంటి అత్యాచార కేసుల్లో సాక్ష్యాల సేకరణ ఎలా ఉంటుందన్నది కళ్లకు కట్టినట్లు చూపించారు. ఈ క్రమంలో వచ్చే కొన్ని సన్నివేశాలు సున్నిత మనస్కులకు ఇబ్బందికరంగా అనిపించొచ్చు. అత్యాచార కేసులో జీవిత ఖైదు పడిన వికాశ్ గ్యాంగ్‌కు జైల్లో ఎదురైన అనుభవాలేంటి? కొడుకు చేసిన తప్పునకు ఓ తల్లిగా భూమిక సమాజం నుంచి ఎలాంటి అవమానాల్ని ఎదుర్కొంది? ఆమె తనపై తాను కేసు వేసుకుని కోర్టు మెట్లు ఎక్కడానికి కారణమేంటి? సమాజంలోని మాదక ద్రవ్యాల ముఠాల్ని ఏరిపారేసేందుకు కమిషనర్ జయదేవ్ చేపట్టిన ఆపరేషన్ యుఫోరియా ఏమైంది? అన్నది ద్వితీయార్ధానికి కీలకాంశాలు. ఆసక్తికరంగా సాగాల్సిన సెకండాఫ్ ఇన్ని పాయింట్ల మధ్య గాడి తప్పిన అనుభూతి కలుగుతుంది. తప్పు చేసిన కొడుక్కి సెకండ్ ఛాన్స్ ఇచ్చి.. అతన్ని మళ్లీ దారిలో పెట్టాలనుకునే తల్లి ఆలోచన మెచ్చుకోదగ్గదే అయినప్పటికీ ఆ ప్రయాణాన్ని కన్విన్సింగ్‌గా చూపించలేకపోయారు. పతాక ఘట్టాలు అందర్నీ ఆలోచింపజేసేలా.. మనసుల్ని కదిలించేలా ఉంటాయి.

# సంగీత్ శోభన్ ప్రధాన పాత్రలో రాకాస




టాలీవుడ్ యంగ్ హీరో సంగీత్ శోభన్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'రాకాస' ఇప్పుడు సినీ ప్రియ-ుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. 'మ్యాడ్' సినిమాతో యువ ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు సంపాదించిన సంగీత్ శోభన్ ఈసారి ఫాంటసీ,హారర్ జానర్‌లో కొత్త ప్రయోగంతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఈ చిత్రంలో 'ఆయ్' మూవీ ఫేమ్ నయన్ సారిక హీరోయిన్‌గా నటిస్తుండగా, దర్శకురాలు మానస శర్మ ఈ సినిమాను రూపొందిస్తున్నారు. ఈ సినిమాను పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై నిహారిక కొణిదెల, ఉమేష్ కుమార్ బన్సాల్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. గతంలో నిహారిక నిర్మించిన 'కమిటీ కుర్రోళ్లు' సినిమా బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకోవడంతో, ఆమె నిర్మాణంలో వస్తున్న ఈ కొత్త ప్రాజెక్ట్‌పై కూడా మంచి అంచనాలు ఏర్పడ్డాయి. యువతరానికి దగ్గరగా ఉండే కథలు, కొత్త కాన్సెప్ట్‌కి ప్రాధాన్యం ఇస్తూ నిహారిక నిర్మాణంలో వస్తున్న ప్రతి చిత్రం ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంటోంది. ఇటీవల విడుదలైన 'రాకాస' టీజర్ ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఫాంటసీ ఎలిమెంట్స్, హారర్ బ్యాక్‌డ్రాప్, కామెడీ టచ్ అన్నీ కలగలిపి వినోదభరితంగా టీజర్ ఉండటంతో సినిమాపై బజ్ ఒక్కసారిగా పెరిగింది. సోషల్ మీడియాలో కూడా ఈ టీజర్‌కు మంచి స్పందన లభించింది. అప్పటి నుంచి సినిమా రిలీజ్ ఎప్పుడన్న ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొంది. ఈ నేపథ్యంలో తాజాగా సినిమా రిలీజ్ డేట్‌ను మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. 'రాకాస' చిత్రాన్ని 2026 ఏప్రిల్ 3న సమ్మర్ కానుకగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు స్పెషల్ పోస్టర్ ద్వారా వెల్లడించారు. సమ్మర్ హాలిడే సీజన్‌ను టా÷-గ్గ్ం÷ట్ చేస్తూ వస్తున్న ఈ సినిమా ఫ్యామిలీ ఆడియన్స్‌తో పాటు యువతను కూడా ఆకట్టుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. సినిమా షూటింగ్ ఇప్పటికే పూర్తవగా, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఫాంటసీ, హారర్, హిలేరియస్ కామెడీ అంశాలతో ఫుల్ ఆన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రం సంగీత్ శోభన్ కెరీర్‌లో మరో ప్రత్యేక మైలురాయిగా నిలుస్తుందా అనే ఆసక్తి నెలకొంది. విభిన్న జానర్‌లో వస్తున్న ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ఫలితం సాధిస్తుందో తెలుసుకోవాలంటే ఏప్రిల్ వరకు వేచి చూడాల్సిందే.

Printed, Published and Owned by **SHAIK FAREED,** and Printed at Sunday Printing Press, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006. and Published from 6-1-303, SIDDIPET, TELANGANA - 505528, Telangana State. Editor: **SHAIK FAREED.** RNI NO : **TGTEL/25/A1737** Email: netisakshinews@gmail.com. Phone No: **9119949944, 9666052221**